ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శుక్రవారం 20.11.2026 | సంపుటి:13 సంచిక:120 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఇంటర్ పరీక్షలకు షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 నుంచి మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు రోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలంగాణ ఇంటర్ బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఫిబ్రవరి 24 నుంచి ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి 25 నుంచి ద్వితీయ

మిగతా 2లో..



మీ ధ్యాస కమీషన్లపైనే

- సీఎం ప్రసంగంలో ప్రగల్భాలు తప్ప.. ప్రజల ఎజెండా లేదు
- సిద్ధిపేటకు నిలిపివేసిన పెండింగ్ పనుల ప్రస్తావనే లేదు: హరీశ్

2లో..

సిద్ధిపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- వచ్చే ఎన్నికల నాటికి హరీశ్ బీఆర్ఎస్ పార్టీలో ఉండడు
- ఆయన బీజేపీతో టచ్‌లో ఉన్నాడు
- సిద్ధిపేట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- రూ.550 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



సిద్ధిపేట(జనంసాక్షి):2029లో మరోసారి తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తానని మాట ఇస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2029లో తెలంగాణలోనే కాదు సిద్ధిపేట గడ్డపై కూడా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ఘంటాపథంగా చెప్పారు.గురువారం సిద్ధిపేటకు వచ్చిన రేవంత్ రెడ్డి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సిద్ధిపేటలో కాంగ్రెస్ జెండా ఎగిరితే

మిగతా 2లో..

సిద్ధిపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఈ గడ్డ మీద నుంచి నేను అడుతున్నా కేసీఆర్‌ను. సాగునీళ్ల పేరు ముసుగులో రేవంత్ రెడ్డి ఆంధ్రాకు నీళ్లు వదలుతున్నాడని మొసలి కన్నీరు కారుస్తున్నారు. నేనూ ఈ తెలంగాణ బిడ్డనే. ఈ మట్టిలో పుట్టినా, ఈ మట్టిలోనే పెరిగా, ఈ మట్టిలోనే కలుస్తా. నా నేలకు నేను అన్యాయం చేస్తనా. నేడు ఈ నీచులు నన్ను శంకించి, నా మీద దుమ్మెత్తిపోసే విధంగా మాట్లాడుతున్నారు. మీరు అసెంబ్లీకి వస్తే అన్నీ విషయాలు మాట్లాడుదాం"
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కాళేశ్వరాన్ని కాంగ్రెస్ వాళ్లే కూల్చారు

మేం కాదు.. ఆ పార్టీ వాళ్లే ఒక్కొక్కరుగా అన్నీ బాగోతాలు బయటపెడుతున్నారు : కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): మేం చెప్పుడు కాదు.. కాంగ్రేసోళ్లే రేవంత్ రెడ్డి బట్టలు విప్పుతున్నరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి సారథ్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి

మిగతా 2లో..

తెలంగాణ ఏఐసీసీ కార్యదర్శులుగా సచిన్ సావంత్, సైమన్ అలెక్స్

పలు రాష్ట్రాలకు నియమించిన అధిష్ఠానం

రాష్ట్రం నుంచి ముగ్గురికి అవకాశం



2లో..

చేతులెత్తేసిన కేంద్రమంత్రి..

రోడ్లపై బ్లాక్‌స్పాట్లకు ఇంజినీర్లదే బాధ్యత

: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

- రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్
- కానీ రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని ఆవేదన
- మంచి రోడ్లు లేకుండా అభివృద్ధి జరగదు : సీఎం రేవంత్ రెడ్డి



2లో..

నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించాలన్న ఏపీ ప్రయత్నాలను

అడ్డుకుంటాం

కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన ఒక్క చుక్కనూ వదులుకోం

పేదల సంక్షేమం - తెలంగాణ అభివృద్ధే మా లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టికరణ



హుజూర్‌నగర్, టౌన్ నవంబర్ 19 (జనంసాక్షి): నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించాలన్న ఏపీ ప్రయత్నాలను అడ్డుకుంటాని, కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన ఒక్క చుక్కనూ వదులుకోమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగిన నూతన పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా జరిగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... కృష్ణా గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన ఒక్క చుక్క నీటిని వదులుకునే ప్రసక్తే లేదని తెలిపారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు న్యాయ వేదికపైనా పోరాడతామని ప్రకటించారు. నాగార్జునసాగర్ నుంచి 1.8 టీఎంసీల నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వానికి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అభ్యంతరాలు తెలిపామన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటాను దెబ్బతీసే ఏకపక్ష చర్యలను అడ్డుకుంటామని చెప్పారు.భారత వైమానిక దళంలో యుద్ధ విమాన పైలట్‌గా చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించాను. అప్పుడు దేశాన్ని కాపాడేందుకు చూపిన క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదలతోనే ఇప్పుడు తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తానని, కృష్ణా నీళ్లైనా, గోదావరి నీళ్లైనా మన హక్కులో ఒక్క చుక్కను కూడా వదులుకోమన్నారు.

మిగతా 2లో..

భారత ప్రజాస్వామ్యం

పవిత్రమైనది

- ఎన్నికలను బహిష్కరిస్తే అంతమవుతుంది
- భారత్ ప్రపంచాన్నినడిపించే శక్తి కావాలి
- వ్యక్తిగత స్నేహాలతో రాజకీయాలు నడవవు
- అలీనోద్యమ స్ఫూర్తి ముందుకు సాగాలి
- అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ

వాషింగ్టన్(జనంసాక్షి): ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయంటూ ప్రతిపక్షాలు పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని రాహుల్ పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం

మిగతా 2లో..

ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఎన్నికలను బహిష్కరిస్తే భారత ప్రజాస్వామ్యం అంతమవుతుంది. కానీ, కాంగ్రెస్ పార్టీకి అలాంటి ఉద్దేశం లేదు. ఎన్నికల్లో పాల్గొనకండి' అని చెబితే ఆ క్షణమే భారత ప్రజాస్వామ్యం అంతమైపోతుంది. కాబట్టి, ప్రస్తుతం ఏం జరుగుతోందో ప్రజలకు వివరించడం, వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని భారత ప్రజలు గ్రహించే వరకు ఎదురయ్యే ఓటములను భరించడమే మా వ్యూహం." - రాహుల్ గాంధీ,



ఒకేసారి కాకుండా ఇకపై విడతలవారీగా..

సిస్టమాటిక్ విత్‌డ్రా ప్లాన్‌ను ప్రకటించిన ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ



న్యూఢిల్లీ(జనంసాక్షి): పదవీ విరమణ అనంతరం పీఎఫ్ నిధుల ఉపసంహరణకు సంబంధించి ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ జీవితంలో కూడబెట్టిన నిధిని రిటైర్మెంట్ తర్వాత ఒకేసారి కాకుండా విడతలవారీగా ఉపసంహరించుకునేలా సిస్టమాటిక్ విత్‌డ్రా ప్లాన్‌ను ప్రకటించింది. దీనికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశం గురువారం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద నెలా నెలా నిర్దేశిత మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు.ఈపీఎఫ్ఓ చందాదారుడు ప్రస్తుతం 55 ఏళ్లు దాటిన తర్వాత నూరు శాతం నిధులు ఉపసంహరించుకోవచ్చు. వీరికి 58 ఏళ్లు వచ్చాక పెన్షన్ ప్రయోజనాలు

మిగతా 2లో..

పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును వెంటనే ఆపండి'

- విభజన చట్టాన్ని ఉల్లంఘించి ప్రాజెక్టు పనులు చేస్తున్నారు
- వెంటనే నిలువరించండి
- కేంద్రజలశక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): నాగార్జునసాగర్ జలాశయం సమీపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. విభజన చట్టాన్ని ఉల్లంఘించి ప్రాజెక్టు పనులు చేస్తున్నారని, వెంటనే నిలువరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల

మిగతా 2లో..

వచ్చే 20ఏళ్లే కీలకం

పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్' నినాదంతో ముందుకు..

వ్యవసాయ రంగంలో పెట్టుబడులను మరింత పెంచాలి

ఫిక్కీ వార్షిక సదస్సులో పరిశ్రమలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి): వ్యవసాయ రంగంలో పెట్టుబడులను మరింత పెంచాలని పారిశ్రామిక రంగానికి మోదీ పిలుపునిచ్చారు. అభివృద్ధి పథంలో సాగాలంటే ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవడం ఆయన అవసరమన్నారు.భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దడంలో పరిశ్రమల పాత్ర ఎంతో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ 'ఇండియా ఫస్ట్' అనేదే ప్రాతిపదికగా ఉండాలని పారిశ్రామిక రంగానికి సూచించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడులు గణనీయంగా పెంచాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి సంస్కరణలు అవసరమో ఎలాంటి సంకోచం లేకుండా తనకు నేరుగా తెలియజేయాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు.దిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు.



మిగతా 2లో..

కృష్ణా నీటిని అప్పనంగా ఏపీకి

అప్పగించింది కేసీఆరే..

- నాగార్జునసాగర్ పేరుతో కేటీఆర్ కొత్త డ్రామాకు తెరలేపారు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విషయం పరిశీలిస్తున్నాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి): నాగార్జునసాగర్ పేరుతో కేటీఆర్ కొత్త డ్రామాకు తెరలేపారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కృష్ణా నీటిని ఏపీకి అప్పగించిందే కేసీఆర్ అని ఆరోపించారు. తెలంగాణ వాటా నుంచి ఒక్క నీటి చుక్కను కూడా తాము పోనివ్వమన్నారు."ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలను గమనిస్తున్నాం. క్రమశిక్షణ విషయంలో అందరూ సమానమే. కొత్త ఇన్‌ఛార్జి రాగానే అన్ని అంశాలను పరిశీలిస్తారు. రాష్ట్రానికి

మిగతా 2లో..

రష్యా, చైనా, అమెరికాల మధ్య సహకారం..

అంతర్జాతీయ భద్రత, స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుంది

ట్రంప్,జిన్‌పింగ్‌తో భేటీలో పుతిన్



బీజింగ్(జనంసాక్షి): చైనాలోని షెంజెన్‌లో అమెరికా, రష్యా, చైనా దేశాల అధినేతలు ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ సమావేశమయ్యారు. సుమారు గంటకుపైగా సాగిన ఈ త్రైపాక్షిక భేటీలో ప్రపంచ శాంతి, స్థిరత్వం సహా విభిన్న అంశాలపై చర్చించారు. ఆయా దేశాల మధ్య విభేదాలున్నప్పటికీ.. సమస్యల పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గమని, వీటిని కొనసాగించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. "ప్రపంచంలో అతిపెద్ద దేశాల అధ్యక్షులుగా.. మన ప్రజలతో పాటు మానవాళిని ప్రభావితం చేసే సమస్యలపై సమగ్రంగా చర్చలు జరపాల్సిన ప్రత్యేక బాధ్యత మనపై ఉంది. తమతో విభేదించే దేశాలతో మునుపటి నాయకులు మాట్లాడేవారు కాదు.

మిగతా 2లో..

అవును.. చైనాపై గూఢచర్యం చేస్తున్నాం

- ఆ దేశం కూడా అమెరికాలో వేగులను ఏర్పాటు చేసింది
- చైనా కంటే మేమే అత్యంత సమర్థంగా ఉన్నాం
- ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వార్త 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20.11.2026



ఈ నెల 22న..

ఓటర్ల జాబితా సవరణపై ప్రజా చర్చ

హైదరాబాద్‌లో సదస్సు, ప్రధాన వక్తగా ప్రశాంత్ భూషణ్

హైదరాబాద్, జనంసాక్షి: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందని రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక పేర్కొంది. ఈ అంశంపై ఈ నెల 22న హైదరాబాద్‌లో ప్రజా సదస్సు నిర్వహిస్తామని ప్రకటించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ముఖ్య వక్తగా పాల్గొంటారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వేదిక ప్రతినిధులు మాట్లాడారు. ఓటర్ల జాబితాలపైనే అనుమానాలు తలెత్తితే ఎన్నికల విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతుందని కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి అన్నారు. మహారాష్ట్రలో జాబితాల్లో భారీ వ్యత్యాసాలున్నాయన్న నివేదికలను ప్రస్తావిస్తూ, మేధావులు, పౌర సంఘాలు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఈ ప్రక్రియ ఏకపక్షంగా సాగుతోందని విమర్శించారు. దీని చట్టబద్ధత, రాజ్యాంగబద్ధతపై ప్రశ్నలున్నాయన్నారు. ఓటర్ల వివరాల అనుసంధానం ఎందుకో, దానికి రాజ్యాంగం లేదా చట్టం ఎక్కడ అనుమతిస్తోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తి పలువురి పేర్ల తొలగింపునకు దరఖాస్తులు చేసినట్లు తెలంగాణ, కర్ణాటకలో ఆరోపణలు వచ్చాయని, దీనిపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని కోరారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సుమారు 50 మంది మేధావులు వేదికగా ఏర్పడ్డారని తెలిపారు. వేదిక ఏర్పాటయ్యాక ఇదే తొలి ప్రజా సమావేశమని సీనియర్ న్యాయవాది జి. జ్యోతి కిరణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డిపి సభ్యులు విరహత్ అలీ, బత్తిని దీప్తి పాల్గొన్నారు.ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.కార్యక్రమ వివరాలు : ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో సదస్సు జరుగుతుంది. "ఓటర్ల జాబితాల సవరణ – రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి సవాళ్లు" అంశంపై ప్రశాంత్ భూషణ్ ప్రసంగిస్తారు.

వచ్చే 20ఏళ్లే కీలకం

భారత్ 2047 లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి, పరిశ్రమల వృద్ధి, అంతర్జాతీయ పోటీలో భారత స్థానం వంటి అంశాలపై మాట్లాడారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించే వారిని గౌరవించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దేశీ వస్తువుల వినియోగం, స్వయం సమృద్ధి గురించి మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు.దాదాపు వందేళ్లు గడిచినా దేశం ఇంకా అదే సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పారిశ్రామిక రంగం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వందేళ్ల క్రితమే గాంధీజీ స్వదేశీ, స్వయం సమృద్ధి గురించి చెప్పారని, ఇప్పటికీ తాను అదే విషయాన్ని చెప్పాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. పరిశ్రమలు ఈ దిశగా మరింత వేగంగా అడుగులు వేయాలని కోరారు. దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

మీ ధ్యాస కమీషన్లపైనే

- సీఎం ప్రసంగంలో ప్రగల్భాలు తప్ప.. ప్రజల ఎజెండా లేదు
- సిద్ధిపేటకు నిలిపివేసిన పెండింగ్ పనుల ప్రస్తావనే లేదు: హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి): సిద్దిపేట బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. రేవంత్‌రెడ్డి మాటల్లో వజన్ లేదు.. చేతల్లో విజన్ లేదని ఎద్దేవా చేశారు. "సీఎం ప్రసంగంలో ప్రగల్భాలు తప్ప.. ప్రజల ఎజెండా లేదు. కరవు కోరల్లో నలుగుతున్న రైతుకు ఊరటనిచ్చే మాటల్లేవు. సిద్దిపేటకు నిలిపివేసిన రూ.1070 కోట్ల పెండింగ్ పనుల ప్రస్తావనే లేదు. ఊదరగొట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఊసేలేదు. పార్టీ మార్పు గురించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం. జిన్నా వచ్చి గాంధీ దేశభక్తిని ప్రశ్నించినట్లు ఉంది. శ్రీకాంత్‌చారి తల్లి శంకరమ్మకు కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఆమెను ఓడించింది కాంగ్రెస్ మంత్రివర్గంలోని ఉత్తమ్ కాదా? రేవంత్‌రెడ్డి బండ్ పెట్టిన కేసీఆర్ పథకాల లిస్ట్ చాంతాడంత ఉంది. ముత్యంరెడ్డి క్యాన్సర్ బారిన పడితే కేసీఆర్ అమెరికాకు పంపించారు" అని హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

సిద్ధిపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం





ఈ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట ప్రజలు కోరిన నాయకుడికే టికెట్ ఇస్తామన్న ఆయన గెలిపించుకునే బాధ్యత మీదేనని ప్రజలకు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీలో ఉండడని చెప్పారు. కేసీఆర్ చేసిన పనులే అవి తిరిగి హరీశ్ రావు రూపంలో రాబోతున్నాయన్నారు. ఆయన బీజేపీతో టచ్‌లో ఉన్నట్లు ఆరోపించారు. లేదంటే సిద్దిపేట ఎల్లమ్మ మీద ఒట్టు వేసి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

వచ్చే ఎన్నికల నాటికి హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీలో ఉండడు : సీఎం రేవంత్ రెడ్డి

ఎమ్మెల్యేగా కూడా గెలవని హరీశ్‌రావుకు 2004లో వైఎస్ఆర్ తన మొదటి కేబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 2004లో వార్డు మెంబర్‌గా కూడా గెలవని హరీశ్‌రావు వైఎస్ భిక్షతో ఏకంగా మంత్రి అయ్యారని చెప్పారు. హరీశ్‌రావు మంత్రి అయ్యాక సిద్దిపేటలో కాంగ్రెస్ అనేది లేకుండా చేయాలని కుట్ర చేశారని ధ్వజమెత్తారు. చైతన్య, నారాయణ కాలేజీలను వ్యతిరేకించిన హరీశ్‌రావు ఇప్పుడు ఆ కాలేజీలకే పాలు సప్లయ్ చేస్తున్నారని సీఎం తీవ్రంగా ధ్వజమెత్తారు.సిద్దిపేట గడ్డ నుంచే అనంతుల మదన్‌మోహన్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఎలుగెత్తి చాటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి మదన్‌మోహన్ పేరు వినపడకుండా చేయాలని కేసీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్‌మోహన్ పేరు పెట్టాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆనాడు కేసీఆర్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందే మదన్‌మోహన్ రావు అని అన్నారు. నమ్మినవారిని మోసం చేసే అలవాటు కేసీఆర్‌కు ఆనాటి నుంచే ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేటలో 2 కిలోమీటర్ల భారీ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. అనంతరం రూ.550 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

జన్వాడ ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?

రంగనాయక్‌సాగర్ దగ్గర హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి? కొండపోచమ్మ దగ్గర కేసీఆర్‌కు వందల ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్‌కు హైటెక్ సిటీకి దగ్గరలో జన్వాడ ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని నిలదీశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న, త్యాగాలు చేసిన ఎంతో మంది కుటుంబాలు అప్పుల్లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావు కుటుంబాలు, బంధువులు మాత్రం వేల కోట్లు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. అసెంబ్లీకి వస్తే వాళ్ల నీళ్ల దోపిడీ, భూముల దోపిడీ, లిక్కర్ దోపిడీని బయటపెడతానని హెచ్చరించారు. సిరిసిల్ల, నేరెళ్లలో ఇసుక దోపిడీలకు పాల్పడింది కేటీఆర్, సంతోష్‌రావు కుటుంబం కాదా? నిలదీశారు.

బతుకమ్మ చీరల్లో కూడా దోపిడీ చేశారు

ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లో కూడా బీఆర్ఎస్ నాయకులు దోపిడీకి పాల్పడ్డారని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. గుజరాత్, సూరత్ నుంచి పనికిమాలిన చీరలు తెచ్చి మహిళలకు ఇచ్చారని మండిపడ్డారు. నవంబర్ 26న కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కేటీఆర్ కవితను బయటికి గెంటేశారని చెప్పారు. సొంత చెల్లిని ఆదరించని వ్యక్తి కోటిమంది మహిళలకు సాయం చేస్తాడా? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం శ్రీకాంత్‌చారి ఎల్బీనగర్ చౌరస్తాలో ప్రాణత్యాగం చేస్తే కేసీఆర్ తన కుమారుడు, కుమార్తె, అల్లుడు, సడ్డకుడి కుమారుడికి పదువులు ఇచ్చుకున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి తల్లికి మాత్రం కేసీఆర్ పదేళ్లపాటు ఏ పదవి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్?ఎస్? నాయకులు దొరల పాలన, పాపాల భైరవుడి మళ్లీ రావాలని అంటున్నారని ఆక్షేపించారు.

సిద్దిపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఈరోజు నుంచి సిద్దిపేట గడ్డ కాంగ్రెస్ అడ్డా అని కార్యకర్తలు నిరూపించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలతో తాటిచెట్టు గుండెలు అదరాలి అని హరీశ్ రావును ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సిద్దిపేటలో అభివృద్ధి పనుల కోసం రూ.550 కోట్ల నిధులను ఈ ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం ఇక్కడ కాంగ్రెస్‌కు ఉన్న గత వైభవాన్ని అందరం గుర్తు చేసుకోవాలన్నారు.

కాళేశ్వరాన్ని కాంగ్రెస్ వాళ్లే కూల్చారు: కేటీఆర్

ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మొన్న జర్నల్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మా కాంగ్రెస్ గవర్నమెంట్‌లో పర్సంటేజీలు లేనిది ఏ పనీ అయితలేదని.. 15-20 శాతం కమిషన్ ఇస్తేనే పని అయితదని ఏమాత్రం సిగ్గు కూడా పడకుండా ఓపెన్‌గా మైకులో చెప్పేసిండు.. మళ్లీ అధికారులు తీసుకుంటుర్రు.. మేం మాత్రం ఎమ్మెల్యేలం మంచి వాళ్లం అని అంటున్నరు. కానీ ఒక్కటి మాత్రం ఒప్పుకున్నడు.. ఇది ప్రజాపాలన కాదు.. అవినీతి పాలన.. ప్రజాపీడన అని మాత్రం ఆయన ఒప్పుకున్నడన్నారు. నిన్నటికి నిన్నకోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కుండ బద్దలు కొట్టేశారు. రేవంత్ రూ.5 లక్షల కోట్లు దోచుకున్న దొంగ.. మొత్తం టెండర్లలో అంతా కుంభకోణాలు, అవినీతి అని చెప్పిండు.. మనమేం బాధపడాల్సిన అవసరం లేదు.. కాంగ్రెసోళ్లే ఒకరి తర్వాత ఒకరు అన్నీ బయటపెడుతున్నరు.. అన్నీ బయటకు వస్తయన్నారు కేటీఆర్.

తెలంగాణ ఏఐసీసీ కార్యదర్శులుగా సచిన్ సావంత్, సైమన్ అలెక్స్

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాష్ట్రాలకు ఏఐసీసీ కార్యదర్శులను నియమించింది. తెలంగాణ రాష్ట్రానికి సచిన్ సావంత్‌తో పాటు, సైమన్ అలెక్స్ నియమితులయ్యారు. ఏపీ, అండమాన్ నికోబార్ దీవులకు ఉమ్మడిగా సెంథిమిల్ అరసు, వి.శంకర్‌ను నియమించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముగ్గురికి ఏఐసీసీలో అవకాశం లభించింది. ఒడిశా కార్యదర్శిగా జెట్టి కుసుమకుమార్, కర్ణాటక కార్యదర్శిగా సయ్యద్ అజుముతుల్లా హుస్సేనీ, ట్రైనింగ్, సందేశ విభాగానికి సంతోష్ కోరుకొండ నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు.

ఒకేసారి కాకుండా ఇకపై విడతలవారీగా..

మొదలవుతాయి. 55 ఏళ్లకు ముందు పదవీ విరమణ చేస్తే కనీస నిల్వ (10%) మినహా మిగిలింది ఉపసంహరించుకోవచ్చు. రిటైర్మెంట్ లేదా 2 నెలల పాటు నిరుద్యోగిగా ఉన్నా కనీస నిల్వనూ విత్‌డ్రా చేయొచ్చు. ఒకసారి రిటైరయ్యాక మూడేళ్ల తర్వాత ఆ ఖాతా ఇన్ యాక్టివ్‌గా మారుతుంది. నిల్వలపై వడ్డీ అందదు.ప్రతిపాదిత పథకం కింద.. రిటైర్మెంట్ తర్వాత వచ్చే నిధిని ఒకేసారి కాకుండా నెల, మూడు నెలలు, అర్ధ సంవత్సరం, సంవత్సరానికి ఇంత మొత్తం చొప్పున ఉపసంహరించుకోవచ్చు. కొంత మొత్తం నగదును తీసుకున్నాక మిగిలిన నిధికి వడ్డీ యథాతథంగా కొనసాగుతుంది. సిస్టమాటిక్ విత్‌డ్రా ప్లాన్ నుంచి ఎప్పుడైనా వైదొలగొచ్చు. చందాదారుడు మరణించిన సందర్భంలో జీవిత భాగస్వామి లేదా నామినీ కూడా ఈ ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. వీళ్లు కూడా నచ్చినప్పుడు వైదొలిగే వెసులుబాటు ఉంటుంది.

అంతర్జాతీయ భద్రత, స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుంది

అలా చర్చలు జరపకుంటే ఏ ఒక్క సమస్యకు పరిష్కారం లభించదు. అందుకే మేం భిన్న మార్గంలో ముందుకు వెళ్తున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు.మూడు దేశాల మధ్య జరిగే చర్చలు ఏదో ఒక ఎంపిక మాదిరిగా ఉండకూడదని, ఇలాంటివి తప్పనిసరిగా జరగాల్సిన అవసరం ఉందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. మానవాళి మొత్తం ఒకే గ్రామంలో నివసిస్తోందని, ఒకరితో ఒకరు అనుసంధానమై ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజంపై ఈ దేశాలకు ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.రష్యా, చైనా, అమెరికాల మధ్య సహకారం అంతర్జాతీయ భద్రత, స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందని పుతిన్ అభిప్రాయపడ్డారు. అయితే, ఈ మూడు దేశాలు నిర్మాణాత్మకంగా కలిసి పనిచేస్తేనే అది సాధ్యమన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం సహా ప్రాంతీయ సంఘర్షణల పరిష్కారానికి సంబంధించి మన దేశాలకు ఒకేవిధమైన ఆలోచనలు ఉన్నాయని అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ఎంతో సహకారం అందించగలమని అన్నారు.

నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించాలన్న ఏపీ ప్రయత్నాలను అడ్డుకుంటాం

రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణ రైతుల సాగునీరు, ప్రజల తాగునీరు, లక్షలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి వినియోగాన్ని మెరుగుపరచడంతో సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణ పెరిగాయని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలు, పనుల తీరుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని సమస్యలే నిదర్శనమని ఉత్తమ్ విమర్శించారు. వారసత్వంగా వచ్చిన సమస్యలను సరి దిద్ది, సాగునీటి మౌలిక వసతులను పరిరక్షించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగి స్తామని తెలిపారు.వాతావరణ పరిస్థితులు, రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి అవసరాల కోసం నీటి సంరక్షణపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కుల కోసం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు

'పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును వెంటనే ఆపండి'

ముఖ్యకార్యదర్శి శ్రీధర్ లేఖ రాశారు. ఇదే విషయమై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్‌కు కూడా లేఖను పంపారు.పల్నాడ్ వాటర్‌గ్రిడ్ ప్రాజెక్ట్ కోసం 150.45 మీటర్లు, 160, 170 మీటర్ల వద్ద ఓపెనింగ్స్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. సాగర్ జలాశయం డెడ్ స్టోరేజ్ అయిన 155.48 మీటర్లు కాగా 150.45 మీటర్ల కంటే దిగువన ఇన్?టేక్?వెల్ ఉండటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఇంతటి దిగువ స్థాయిలో ఇన్?టేక్?వెల్ నిర్మిస్తే రిజర్వాయర్ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని లేఖలో పేర్కొంది. జలాశయ నిర్వహణ, నీటి నియంత్రణతోపాటు ఇప్పటికే ఉన్న నీటి కేటాయింపులపైనా తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపింది.

అదనపు నీటి కోసం అనుమతులు తీసుకోవాలి

ఈ అంశంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, సంబంధిత అధికారులు అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖలో కోరింది. ప్రాజెక్టుకు సంబంధించిన ఇన్‌టేక్ వెల్స్, నీటి శుద్ధి కేంద్రాలు, జలాశయాలు, పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపింది. ఇప్పటికే నాగార్జునసాగర్ కుడి కాలువ తాగునీటి అవసరాల కోసం ఏటా 2.84 టీఎంసీల నీటిని ఏపీ తరలిస్తోందని, అదనంగా తీసుకోవాలంటే కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు తప్పనిసరని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రాజెక్ట్ పనులు నిలిపేయడంతోపాటు, నీటిని తరలించకుండా తక్షణమే ఆదేశాలు జారీచేయాలని కేంద్ర జలశక్తి శాఖ, కేఆర్ఎంబీని కోరింది.

అవును.. చైనాపై గూఢచర్యం చేస్తున్నాం

షెంజెన్(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనాపై గూఢచర్యం చేస్తున్నట్లు తెలిపారు. ఆ దేశం కూడా అమెరికాలో వేగులను ఏర్పాటు చేసిందని, ఆ విషయానికొస్తే.. చైనా కంటే తామే అత్యంత సమర్థంగా గూఢచర్యం చేస్తున్నామన్నారు. ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఎపెక్) సమిట్‌లో పాల్గొనేందుకు చైనా వెళ్లిన ట్రంప్.. సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడారు. అమెరికాతో యుద్ధంలో ఇరాన్‌కు చైనా సాయం చేస్తోందన్న వాదనను కొట్టిపారేశారు. ఒకవేళ చైనా సాయం చేస్తే.. వెంటనే తమకు తెలిసిపోతుందన్నారు. ఒక విధంగా అమెరికాలో జరిగిన విషయాలకంటే.. చైనాలో చోటు చేసుకుంటున్న పరిణామాలే తమకు ఎక్కువగా తెలుస్తాయని వ్యాఖ్యానించారు. "అమెరికాలో గూఢచర్యం చేస్తున్నట్లు వారు చెబుతారు. మంచిదే.. చేయనివ్వండి. మేం కూడా చేస్తున్నాం. నిఘా విషయంలో వాళ్ల కంటే మెరుగ్గానే ఉన్నాం. అయితే, ఏం చేస్తున్నాం? ఎలా చేస్తున్నాం? అనే విషయాలు చెప్పలేను. కానీ, నాకు ప్రతిదీ తెలుసు" అని ట్రంప్ అన్నారు. చర్చల్లో భాగంగా.. అమెరికాపై గూఢచర్యం ఆపాలని చైనాను అడుగుతారా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆ మాట నా నోటి నుంచి వచ్చిన వెంటనే వాళ్లే నన్ను ఆపమని అడుగుతారు' అని ట్రంప్ అన్నారు. ఇటీవల సంచలనంగా మారిన ఎన్విడియా వ్యవహారంపైనా విలేకరులు ప్రశ్నించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. అదొక విషాదంగా అభివర్ణించారు. సంస్థ మాజీ సీఈవో జెన్సన్ మహా మేధావి అని, అలాంటి వారిని కాపాడుకోవాల్సిన అవసరం దేశానికి ఉందన్నారు. అలిస్ చైనా గూఢచారి అని ఇదివరకెప్పుడూ తాను వినలేదని చెప్పారు. చైనా నుంచి వచ్చే అందమైన మహిళలను సాధారణంగా గూఢచారి అని ముద్ర వేస్తుంటారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమె ఓ వ్యాపారవేత్త. ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకునేందుకు ఇక్కడి చిప్‌లను కొనుగోలు చేసేందుకు వచ్చారు. మాకు డబ్బులు కావాలి గనక.. వాటిని విక్రయించేందుకు అనుమతి ఇచ్చాం. అందులో తప్పేముంది?" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొంది. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు; ఫస్ట్ ఇయర్ సైన్స్ సబ్జెక్టులకు (కొత్త ప్యాటర్న్ ప్రకారం) ఫిబ్రవరి 11 నుంచి 18వరకు మూడు సెషన్లలో జరగనున్నాయి. ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 29న, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు జనవరి 30న నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్ (ఆదివారాల్లో సహా) ఉంటాయని వెల్లడించారు. అయితే, ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌కూ ఇదే టైం టేబుల్ వర్తిస్తుందని.. వారి పరీక్షల టైం టేబుల్‌ను మాత్రం వేరేగా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్లపై బ్లాక్‌స్పాట్లకు ఇంజినీర్లదే బాధ్యత

హైదరాబాద్(జనంసాక్షి):దేశంలో రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ మాటలు చెప్పడం కొంచెం ఇబ్బందిగా ఉన్నా.. చెప్పక తప్పని పరిస్థితి. ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారు. వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. ఈ రోడ్లపై ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? డీపీఆర్లు ఎలా తయారవుతున్నాయి? ఒక్క డీపీఆర్ కూడా సరిగ్గా తయారు కావడం లేదు. ఈ పదం వాడుతున్నందుకు క్షమించండి. ఇకపై రోడ్లపై బ్లాక్ స్పాట్స్ కనిపించకూడదు. బ్లాక్‌స్పాట్ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీర్లదే" అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. 'కనెక్టింగ్ రోడ్స్ క్రియేటింగ్ టుమారో' ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో పెట్టుబడుల సాధనలో సమ్మిట్ కీలకమని తెలిపారు..జాతీయ రహదారుల నిర్మాణంలో చాలా రికార్డులు సాధించామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

రహదారులు సరిగా ఉంటే పెట్టుబడులు

రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్‌గా ఉందని నితిన్ గడ్కరీ చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. అయితే పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత విషయంలో మనం ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. రోడ్లపై ఎలాంటి బ్లాక్ స్పాట్లు ఏర్పడకుండా ఉండేందుకు ప్రతి ఇంజినీర్ పూర్తి బాధ్యత తీసుకుని పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులతు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65ను ఆరు లైన్లుగా విస్తరించాలని కోరారు. "తెలంగాణ రాష్ట్రంలో రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 వరకు రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకనామీ చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

భారత ప్రజాస్వామ్యం 'పవిత్రమైనది'

కోల్పోకుండా, ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లను భరిస్తూ పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయంటూ ప్రతిపక్షాలు పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా అమెరికాకు వెళ్లిన రాహుల్?గాంధీ, అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మేరకు మాట్లాడారు. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పౌరుల ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తోందని, ప్రజల పట్ల జవాబుదారీతనాన్ని బలహీనపరుస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల శాఖ ఇన్‌ఛార్జి జైరాం రమేశ్

ఢిల్లీ స్థాయిలో గట్టుప్పల్‌కు గుర్తింపు

చేనేత సంస్థ బోర్డు డైరెక్టర్‌గా కర్నాటి వజ్రమ్మ వెంకటేశం

- రాజకీయంగా అణచివేయాలని చూశారు: వెంకటేశం
- ఒక్క నూలుపోగు కూడా పీకలేరు: కూసుకుంట్ల సవాల్



మర్రిగూడ/గట్టుప్పల్, నవంబర్ 19 (జనంసాక్షి): జాతీయస్థాయి ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డు డైరెక్టర్‌గా కర్నాటి వజ్రమ్మ వెంకటేశం ఎన్నిక కావడంతో గట్టుప్పల్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం గట్టుప్పల్‌లో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎన్ని అడ్డంకులు సృష్టించినా కర్నాటి వెంకటేశంను ఏమీ చేయలేరని, ఒక్క నూలుపోగు కూడా పీకలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం మాట్లాడుతూ.. తన కుటుంబాన్ని రాజకీయంగా అణచివేయాలని, డబ్బు సంచులతో ప్రలోభపెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. గట్టుప్పల్ అభివృద్ధికి రెండు వరుసల రహదారి, హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ కాంగ్రెస్ హామీలపై విమర్శలు చేయగా, బీఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి రాజకీయ కక్షసాధింపులు విడనాడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్, మెండు మోహన్‌రెడ్డి, వెంకట్ నారాయణ గౌడ్, దంటు జగదీశ్వర్, వెంకట్ రమణారెడ్డి, కొత్త సతీష్, దామోదర్‌రెడ్డి, బండారు చంద్రయ్య, గీత, శ్రీనివాస్, చెరుపల్లి భాస్కర్, దోర్నాల నరేందర్, అంతిరెడ్డి, మహేష్, బీరప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ పథకాలు

- అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- తూతూ మంత్రంగానే పాలకుల పర్యవేక్షణ





రేగొండ,నవంబర్ 19 (జనం సాక్షి): ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు సరైన సదుపాయాలు అందాలని...ప్రజల మన్నెనలు పొందాలని తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరుగారి పోతున్నాయి.ప్రభుత్వ ఆదేశాలను క్షేత్ర స్థాయిలో అమలు పరిచినప్పుడే ప్రభుత్వ పథకాలకు సరైన అర్థం లభిస్తుంది.అలాంటిది తమకు సంబంధం లేనట్లు క్షేత్ర స్థాయి అధికారులు వ్యవహరిస్తే పథకాల ఆవిష్కరణలకు అర్థం లేకుండా పోతుంది.ఇలాంటి అధికార నిర్లక్ష్య వైఖరి రేగొండ మండల అధికారులలో స్పష్టంగా కనబడుతుంది.

రేగొండ మండల అధికారుల అధికార నిర్లక్ష్యానికి అద్దం పట్టేలా మచ్చుకు ఒకటి చూద్దాం...తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా డిజిటల్, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించింది. వీటి ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు డిజిటల్‌గా నమోదు చేసి, రేషన్ సరుకుల పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహించాలనేది ప్రభుత్వ లక్ష్యం.కానీ మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను తూ తూ మంత్రంగానే లబ్ధిదారులకు పంపిణీ చేశారు.మిగిలిన కార్డులు చెత్తకుప్పకే పరితమయ్యాయి.

పాలకులు,కార్యకర్తల పర్యవేక్షణ కరువు..!

ప్రభుత్వ పథకాల పంపిణీపై అధికారుల వైఖరి ఏ విధంగా ఉంది.సరైన రీతిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అని గ్రామాల్లో కార్యకర్తలు,పాలకులు ఓ కన్నెయాల్సి ఉంటుంది.కానీ మండలంలో ఉన్న నాయకులు అందులో వెనుకంజలో ఉన్నారనే చెప్పాలి.ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియపర్చడంలో సైతం అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. ఇదిలాగే కొనసాగితే ప్రభుత్వం పై ప్రజలకు విశ్వాసం పోయే ప్రమాదం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా చొరవ చూపాలని కోరుకుందాం.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పల్లవి విద్యార్థి

తెలంగాణ జూనియర్ బాలుర జట్టుకు మహ్మద్ నిసార్ ఉద్దీన్ ఎంపిక



హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి): జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సరూర్‌నగర్‌లోని పల్లవి అవర్ స్కూల్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థి మహ్మద్ నిసార్ ఉద్దీన్ ఎంపికయ్యాడు. ఉత్తర గోవాలోని కలంగుటే వేదికగా నవంబర్ 21 నుంచి 26 వరకు జరగనున్న 10వ ఎస్‌డీపీఎఫ్ జాతీయ సమ్మాళ్య కప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు తరఫున అతను ప్రాతినిధ్యం వహించనున్నాడు. స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ ప్రమోషన్ అసోసియేషన్ (ఎస్‌డీపీఏ) తెలంగాణ విభాగం జనరల్ సెక్రటరీ అద్వాన్ అశ్వత్ అల్ అమూది నాయకత్వం, మార్గదర్శకత్వంలో రాష్ట్ర జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ మేరకు ఎస్‌డీపీఏ తెలంగాణ విభాగం అధికారికంగా ఎంపిక పత్రాన్ని విడుదల చేసింది.

ఈ పోటీల్లో తెలంగాణ తరఫున అండర్-15, అండర్-17, అండర్-19 బాలుర ఫుట్‌బాల్ జట్లతో పాటు రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టు కూడా పాల్గొననుంది. చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నిసార్ ఉద్దీన్‌ను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. రాబోయే పోటీల్లో నిసార్‌తో పాటు తెలంగాణ క్రీడా బృందం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల యాజమాన్యం, ఎస్‌డీపీఏ తెలంగాణ ప్రతినిధులు ఆకాంక్షించారు.

యువ క్రీడాకారుల ప్రతిభకు ఖేలో ఇండియా వేదిక

- జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): యువ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని, దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - తెలంగాణ 2026 (డిసెంబర్ 11 నుంచి 22 వరకు) కు సంబంధించిన అధికారిక లోగో, మస్కట్ 'నీలమణి' పోస్టర్లను గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్, జిల్లా యువజన, క్రీడల అధికారి చిర్ర రఘుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ వేదిక కావడం గర్వకారణమని, జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ చిర్ర రఘు, కార్యాలయ సిబ్బంది ఎం. శివసాగర్ పాల్గొన్నారు.

పూర్ణిమ అగ్రిమాలకు నోటీసులు



- కమిషనర్ నరేష్ రెడ్డి వెల్లడి
- జనం సాక్షి కథనానికి మున్సిపల్ అధికారుల స్పందన

నర్సంపేట, నవంబర్ 19 (జనంసాక్షి) : జనంసాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు పూర్ణిమ అగ్రిమాలకి నోటీసులు అందించినట్లు మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి. గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలు, రహదారులను ఆనుకొని నిబంధన లకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సంబంధిత వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

మహదేవపూర్‌లో గంజాయి వినియోగంపై పోలీసుల తనిఖీలు

- తొమ్మిది మందికి వైద్య పరీక్షలు.. ఇద్దరికి పాజిటివ్.
- పాజిటివ్‌గా తేలిన ఇద్దరిపై కేసుల నమోదు

మహదేవపూర్, నవంబర్ 19 (జనంసాక్షి) : గంజాయి వినియోగంపై మహదేవపూర్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి సేవిస్తున్నట్లు అనుమానం ఉన్న తొమ్మిది మందిని గుర్తించి భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఇద్దరికి గంజాయి వినియోగం పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి వ్యసనం నుంచి బయటపడేందుకు సదరు వ్యక్తులకు డీ-అడిక్షన్ కేంద్రం ద్వారా కౌన్సెలింగ్, వైద్య చికిత్స, పునరా వాస సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

పిల్లల ప్రవర్తన, స్నేహితుల వలయం, రోజువారీ కార్యకలాపాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని పోలీసులు సూచించారు. ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వారితో మాట్లాడాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనారోగ్య, కుటుంబ, భవిష్యత్తు సమస్యలపై అవగాహన కల్పించాలని కోరారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు గుర్తిస్తే నిందించకుండా వైద్యుల సహాయం తీసుకోవాలని సూచించారు.యువత గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మహదేవపూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఈ యువతను చెడు స్నేహాలకు దూరంగా ఉంచి చదువు, క్రీడలు, మంచి అలవాట్ల వైపు ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి



- గిరిజన సంక్షేమ శాఖ డిడి దేశిరాం నాయక్

మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 19 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులుతో డీడీ గిరిజన సంక్షేమ శాఖ డిడి దేశిరాం నాయక్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన స్టడీ అవర్స్ నిర్వహించి, విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. అలాగే పాఠశాలలు మరియు వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారికి అవసరమైన ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మరియు వసతి గృహ సంక్షేమ అధికారులు విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, అనుమతి లేకుండా పాఠశాలలు మరియు వసతి గృహాలను విడిచివెళ్లరాదని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, మెరుగైన ఫలితాల సాధన మరియు వారి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని తెలిపారు.



సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిలిపివేయాలి

- సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధం..
- ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిలిపివేసి 24 డిమాండ్లపై వెంటనే సర్కులర్లు విడుదల చేయాలని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్ కుమార్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 27న ఆర్ఎల్సీ సమక్షంలో 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరినా ఇప్పటివరకు సర్కులర్లు విడుదల చేయలేదన్నారు. మెడికల్ బోర్డులు క్రమం తప్పకుండా నిర్వహించి, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. భూగర్భ కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు అందించాలని, ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు. అనంతరం జీఎంకు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, జి. సుధాకర్ రెడ్డి, ఎం.డి. ఆసిఫ్ పాషా, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు నేటి తరానికి ఆదర్శం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఇందిరా గాంధీ సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలను, పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన చారిత్రాత్మక నిర్ణయాలను, దేశ సమగ్రత మరియు సమైక్యత కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆమె ధైర్యసాహసాలు, నాయకత్వ పటిమ, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఎల్లప్పుడూ ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు కురిమిల్ల శీను, చల్ల రేణుక, పొన్నగంటి శీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ భువన సుందర్, ఎన్ఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్టేవాడ సురేష్, ఆలోత్ కిషోర్, నాగరాజు, అవినాష్ రాజు, హరీష్, బన్నీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణంమీదికి తెచ్చిన మండి బిర్యానీ

- ఒకే కుటుంబంలో 9 మందికి అస్వస్థత
- మహిళకు ఏకంగా న్యూరో సమస్య!

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. మండీ బిర్యానీ తిన్న ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఐదుగురు చిన్నారులు ఉండగా, ఓ మహిళకు న్యూరో సంబంధిత సమస్య తలెత్తడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ షాకింగ్ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబర్‌పేటలో నివాసం ఉండే ఓ కుటుంబం ఈ నెల 15న స్థానిక గాంధీబొమ్మ సమీపంలోని ముక్రం బిర్యానీ హోటల్ నుంచి మండీ బిర్యానీ తెప్పించుకుని బంధువులతో కలిసి తిన్నారు. భోజనం చేసిన కొద్దిసేపటికే వారిలో తొమ్మిది మందికి వాంతులు, విరేచనాలు మొదలై తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీనిపై బాధితులు సదరు హోటల్ యజమానిని నిలదీయడంతో, ఆయన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వారికి ప్రాథమిక చికిత్స చేయించారు.

మహిళకు న్యూరో సమస్య

అయితే, అస్వస్థతకు గురైన వారిలో ఒక మహిళకు న్యూరో సమస్య తలెత్తి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాధితులందరినీ మెరుగైన వైద్యం కోసం బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల్లో ఐదుగురు ఏడేళ్లలోపు చిన్నారులు ఉండటం, ఫీవర్ ఆసుపత్రిలో ఆ వయసు పిల్లలకు చికిత్స అందించే అవకాశం లేకపోవడం, పైగా ఓ మహిళకు న్యూరో సమస్య ఉన్నట్లు ప్రైవేట్ ఆసుపత్రి రిపోర్టులలో వెల్లడి కావడంతో వైద్యులు వారందరినీ ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన వారిలో సయ్యద్ నసీమ్ సుల్తానా, ఖతీజా తుల్ కుబ్రా, ఆస్మా సుల్తానాతో పాటు కాచిగూడ నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ ఆమీర్, మరో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రిలో వీరికి చికిత్స కొనసాగుతోంది.

కోతుల దాడిలో రైతుకు తీవ్ర గాయాలు



ఎల్లారెడ్డిపేట (జనంసాక్షి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో కోతుల దాడిలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన పాతూరి బాల్‌రెడ్డి ఇంటి ముందు నిలబడి ఉండగా, కోతి ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయనను సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కొంతకాలంగా కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇళ్ల వద్దకు, వీధుల్లోకి కోతులు గుంపులుగా వస్తుండటంతో ప్రజలు, విద్యార్థులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. గత ఏడాది నూతన పాలకవర్గం ఏర్పాటు కాకముందు కోతుల నివారణ కోసం ఒక్కో ఇంటి నుంచి రూ.600 చొప్పున వసూలు చేశారు. సిద్దిపేట జిల్లా కోహెడ నుంచి కోతులను పట్టేవారిని రప్పించి, కొన్ని కోతులను పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదిలిపెట్టారు. అయితే ప్రస్తుతం మళ్లీ కోతుల బెడద పెరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, ప్రజలు, విద్యార్థుల భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 నవంబర్ 2026

పేదరికంపై ప్రధాని ప్రకటన

గణాంకాల గారడీ, వాస్తవాల మరుగు

"పేదరికాన్ని కూడా అంతే వేగంతో జయించాం" అని ప్రధాని నరేంద్ర మోదీ ఫిక్కీ వార్షిక సమావేశంలో చేసిన ప్రకటన వినడానికి బాగుంటుంది. కానీ వాస్తవం ఆ మాటలకు చాలా దూరంలో ఉంది. గత 13 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు నివేదికను ఉటంకిస్తూ, దాన్ని భాజపా హయాం ఘనతగా చెప్పుకోవడం రాజకీయ ప్రచారమే తప్ప నిజాయితీతో కూడిన విశ్లేషణ కాదు. పేదరిక సూచీలో గణాంకాలు తగ్గడానికీ, ప్రజల జీవితాలు మెరుగుపడటానికీ మధ్య ఉన్న తేడాను పాలకులు ఉద్దేశపూర్వకంగా దాచేస్తున్నారు.

ఈ సూచీ తగ్గుదల వెనుక అసలు కారణం ఏమిటి? దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నారు. అంటే ఇంత భారీ జనాభా ప్రభుత్వం ఇచ్చే బియ్యం, గోధుమలపై ఆధారపడి బతుకుతోంది. ఈ ఉచిత ధాన్యం వల్ల కుటుంబాల ఖర్చు కొంత తగ్గి, కొనుగోలు శక్తి పెరిగినట్లు లెక్కల్లో కనిపిస్తోంది. అంతే తప్ప ఉపాధి కల్పన ద్వారా, స్థిరమైన ఆదాయం ద్వారా ప్రజలు పేదరికం నుంచి బయటపడలేదు. సంక్షేమ పథకాల వల్ల వచ్చిన తాత్కాలిక ఉపశమనాన్ని ఆర్థిక విజయంగా చూపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే.

దేశంలో 80 కోట్ల మందికి ఇంకా ఉచిత రేషన్ అవసరమవుతోందంటే, పేదరికం జయించామనే మాటకు అర్థమేముంది? నిజంగా పేదరికం పోతే ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలకు ప్రభుత్వ సాయం ఎందుకు కొనసాగించాలి? కడుపు నిండా తిండి దొరకడం ముఖ్యమే. కానీ అది ప్రభుత్వ దయపై ఆధారపడిన జీవితమైతే, దాన్ని ప్రగతి అని పిలవలేం. పేదరికాన్ని జయించడమంటే ప్రజలు సొంత కాళ్లపై నిలబడేలా చేయడం, గౌరవప్రదమైన ఉద్యోగాలు, న్యాయమైన వేతనాలు కల్పించడం.

ఆ దిశగా చూస్తే చిత్రం ఆందోళనకరంగా ఉంది. యువతలో నిరుద్యోగం పెరుగుతోంది. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. అసంఘటిత రంగంలో కోట్లాది మంది అరకొర ఆదాయంతో బతుకుతున్నారు. వ్యవసాయ రంగం గిట్టుబాటు ధరలు లేక సతమతమవుతోంది. ఈ వాస్తవాలను పక్కన పెట్టి కేవలం సూచీల్లో తగ్గుదలను చూపించి గొప్పలు చెప్పుకోవడం ప్రజల కష్టాలను అవమానించడమే.

కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించామని, రూ. 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇచ్చామని చెబుతూ, "ఇది స్నేహపూర్వక ప్రభుత్వం, మీరంతా మా స్నేహితులే" అని పారిశ్రామికవేత్తలతో అనడం గమనార్హం. కార్పొరేట్లకు స్నేహితుడిగా ఉంటానని ప్రధాని బహిరంగంగా చెప్పుకోవడంలో తప్పేమీ లేదు. కానీ ఆ స్నేహం ఎవరి ప్రయోజనాల కోసం అనే ప్రశ్న తలెత్తుతుంది. పన్ను రాయితీలు పొందిన సంస్థలు ఆ మేరకు ఉద్యోగాలు సృష్టించాయా? వేతనాలు పెంచాయా? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. రాయితీలు కంపెనీల లాభాలను పెంచాయి, కానీ సామాన్యుడి జేబులో ఆదాయాన్ని పెంచలేదు.

గత ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనలో విఫలమయ్యాయని, భారత్ ఒకప్పుడు బలహీన ఐదు దేశాల సరసన ఉండేదని ప్రధాని విమర్శించారు. గతాన్ని నిందించడం సులభం. కానీ పదకొండేళ్లకు పైగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇంకా గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి మాట్లాడటం జవాబుదారీతనం నుంచి తప్పించుకునే ప్రయత్నమే. ఈ కాలంలో దేశం సాధించిన పురోగతికి ఆ ప్రభుత్వాలు వేసిన పునాదులు కూడా కారణమనే నిజాన్ని అంగీకరించే విశాల హృదయం కావాలి.

దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందనేది వాస్తవమే కావచ్చు. కానీ ఆ అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరుతున్నాయా అనేది అసలు ప్రశ్న. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతూ, కోట్లాది మంది ఉచిత రేషన్‌పై బతుకుతుంటే అది సమ్మిళిత వృద్ధి కాదు. పేదరికం తగ్గిందని చెప్పే ముందు ఉపాధి ఎంత పెరిగిందో, వేతనాలు ఎంత పెరిగాయో, అసమానతలు ఎంత తగ్గాయో ప్రభుత్వం లెక్కలతో చెప్పాలి. అప్పటివరకు ఈ ప్రకటనలు ప్రజల ఆకలిని రాజకీయ పెట్టుబడిగా మార్చుకునే ప్రయత్నాలుగానే మిగిలిపోతాయి.

సంపాదకీయం

జనంసాక్షి

కాళోజీ కళాక్షేత్రం..
ప్రభుత్వ కార్యాలయమా? సాంస్కృతిక కేంద్రమా?

తెలంగాణ అస్తిత్వానికి, ప్రజాస్వామిక చైతన్యానికి, సామాజిక స్పృహకు ప్రతీకగా నిలిచిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరు మీద నిర్మించిన కళాక్షేత్రం ఉద్దేశం ఏమిటి? ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణా? లేక సాహిత్య, కళా, సాంస్కృతిక వికాసానికి శాశ్వత వేదికగా నిలవడమా? ఇప్పుడు హనుమకొండలో ఈ ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. కాళోజీ కళాక్షేత్రంలోకి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయాన్ని తరలించాలనే ప్రతిపాదనపై కాళోజీ అభిమానులు, వరంగల్, హనుమకొండ సాహిత్య, సాంస్కృతిక వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని కళాక్షేత్రం అసలు లక్ష్యాన్ని కాపాడాలని వారు మూకుమ్మడిగా కోరుతున్నారు.

కాళోజీ ఒక వ్యక్తి మాత్రమే కాదు. ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక సామాజిక చైతన్యం. తెలంగాణ ప్రజల భాషలో, యాసలో, బాధలో, పోరాటంలో తన కవిత్వాన్ని మమేకం చేసిన ప్రజాకవి ఆయన. అధికారాన్ని ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎదిరించడం, ప్రజల పక్షాన నిలబడటం ఆయన జీవిత సందేశం. అలాంటి మహనీయుడి స్మారకార్థం నిర్మించిన ఈ కళాక్షేత్రం ఒక సాధారణ భవనం కాదు. అది తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. అందుకే దాని వినియోగం విషయంలో ప్రభుత్వం అత్యంత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధాసక్తులతో ఈ కళాక్షేత్రం నిర్మాణం చేపట్టడం హర్షణీయం. సాహిత్య సమావేశాలు, కవిసమ్మేళనాలు, నాటక ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, చర్చాగోష్ఠులు నిర్వహించడంతో పాటు గ్రంథాలయం, పఠనశాల ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ప్రశంసనీయం. కాళోజీ ఫౌండేషన్ కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా ఒక హాలు, రెండు గదులు కేటాయిస్తామని కూడా అప్పట్లో ప్రభుత్వం తరపున హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే భవనం నిర్మాణం పూర్తవడం, ప్రారంభోత్సవం జరగడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత ముగిసినట్లు కాదు. నిర్మాణం వెనుక ఉన్న లక్ష్యాలను ఆచరణలో పెట్టినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుంది. ప్రభుత్వాలు మారినా ప్రజా ప్రయోజనాల కోసం రూపొందించిన సంస్థల ప్రాథమిక లక్ష్యాలు మారకూడదు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. కళాక్షేత్రం ప్రారంభోత్సవ సమయంలోనూ, ఆ తర్వాత సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలకు అవసరమైన సదుపాయాలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం



విచారకరం. ఇప్పుడు అందులోకి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ 'కుడా' కార్యాలయాన్ని తరలించాలనే ఆలోచన తెరపైకి రావడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు భవనాలు అవసరం కావచ్చు. పట్టణాభివృద్ధి సంస్థకు (కుడా)కు కూడా తగిన వసతులు కల్పించాల్సిందే. కానీ అందుకోసం ప్రత్యేక ప్రయోజనంతో నిర్మించిన ఈ సాంస్కృతిక కేంద్రాన్ని వినియోగించడం ఎంతవరకు సమంజసం? నగరంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇతర భవనాలు, స్థలాలు పరిశీలించే అవకాశం లేదా? ఒకవేళ కళాక్షేత్రంలోని కొంత భాగాన్ని కార్యాలయ అవసరాలకు కేటాయించినా, క్రమంగా దాని ప్రధాన ఉద్దేశం దెబ్బతినే ప్రమాదం లేదా? కార్యాలయ కార్యకలాపాలకు సంబంధించిన రాకపోకలు, పరిపాలనా అవసరాలు, భద్రతా పరిమితులు సాహిత్య, కళా కార్యక్రమాల స్వేచ్ఛాయుత నిర్వహణకు ఆటంకం కలిగించవచ్చు. అంతేకాకుండా, ఒకసారి కార్యాలయం ఏర్పాటైతే భవిష్యత్తులో దానిని తిరిగి ఖాళీ చేయించడం మరో సమస్యగా మారవచ్చు.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని కూడా గుర్తించాలి. సాంస్కృతిక సంస్థలు ప్రభుత్వ భవనాల్లో స్థలం కోసం అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు. కళాకారులు, రచయితలు, కవులు, పరిశోధకులు, విద్యార్థులు స్వేచ్ఛగా సమావేశమై తమ ఆలోచనలను పంచుకునే వేదికలు ప్రజాస్వామ్య సమాజానికి అత్యవసరం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు గొప్ప చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక నేపథ్యం ఉంది. కాకతీయుల కళావైభవం నుంచి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వరకు, ప్రజా ఉద్యమాల నుంచి ఆధునిక సాహిత్య చైతన్యం వరకు ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన వారసత్వం ఉంది. అలాంటి ప్రాంతంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం భవిష్యత్తు తరాలకు సాంస్కృతిక మార్గదర్శిగా నిలవాలి.

కళాక్షేత్రంలో ఆధునిక గ్రంథాలయం, డిజిటల్ పఠన సదుపాయాలు, కాళోజీ రచనలు, ప్రసంగాలు, జీవిత విశేషాలతో కూడిన ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. యువ కవులు, రచయితలకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలి. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సాహిత్య పరిచయ కార్యక్రమాలు చేపట్టాలి. స్థానిక కళాకారులకు ప్రదర్శనలకు అవకాశం కల్పించాలి. కాళోజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేవలం అధికారిక వేడుకలకే పరిమితం చేయకుండా, ఆయన ఆలోచనలను సమకాలీన సమాజంతో అనుసంధానించే చర్చలకు వేదికగా మలచాలి. ఇందుకోసం సమర్థవంతమైన నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, అందులో సాహితీవేత్తలు, కళాకారులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలి.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ సమస్యను ఒక భవన కేటాయింపు వివాదంగా కాకుండా తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన అంశంగా చూడాలి. గత ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయడం ఎంత సులభమో, గతంలో నిర్మించిన ప్రజా ప్రయోజనకరమైన సంస్థలను వాటి లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం అంతే ముఖ్యమైన బాధ్యత. కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రభుత్వ కార్యాలయాల కోసం వినియోగించకుండా, సాహిత్య, కళా, సాంస్కృతిక కార్యక్రమాలకే ప్రత్యేకంగా కేటాయించాలి. కుడా కార్యాలయానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలి. అంతేకాకుండా, గతంలో ప్రకటించిన గ్రంథాలయం, పఠనశాల, ఫౌండేషన్‌కు సంబంధించిన హాలు, గదుల కేటాయింపు హామీలను కూడా వెంటనే అమలు చేయాలి.

కాళోజీ జీవితమంతా ప్రజల గొంతుకగా సాగింది. ఆయన పేరుతో నిర్మించిన కళాక్షేత్రం కూడా ప్రజల ఆలోచనలకు, కళలకు, సృజనాత్మకతకు గొంతుక కావాలి. స్మారక భవనాలు నిర్మించడం కంటే వాటి ఆశయాలను సజీవంగా ఉంచడం గొప్ప నివాళి. కాళోజీని గౌరవించడం అంటే ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు; ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామిక, సాహిత్య, సాంస్కృతిక వాతావరణాన్ని నిర్మించడం. ముఖ్యమంత్రి ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, కాళోజీ కళాక్షేత్రం తన అసలు లక్ష్యాన్ని కోల్పోకుండా తగిన నిర్ణయం తీసుకుంటారని సాహిత్యాభిమానులు ఆశిస్తున్నారు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,
9849328496,
ramkishore.1504@gmail.com

మంజరి

విరితోట వలపుల
విరహపు బాట
సిరి వెన్నెల కురిసె
జిగెలుగా తోట

మనసు వికలమైన
మల్లెల తోవ
తనువు విలవిలకు
తామర సేవ
రాలిన విరులవి

రసమయ బతుకు
జాలిగా పుడమికి
సాగిల మొక్కు

అందమైన బతుకు
ఆనంద మయ్యె
సుందర బంధాలు
సాగసుల దండ

రేడియమ్
9291527757

స్ఫూర్తి ప్రదాత చుక్కారామయ్య



తన దేశాన్ని చూచి గర్వించే వ్యక్తులు చాలామంది ఉండవచ్చు. కానీ తన దేశానికే గర్వకారణంగా నిలిచే వ్యక్తులు చాలా అరుదు. అలాంటి విశిష్ట వ్యక్తులలో ప్రముఖ విద్యావేత్త, మహామనీషి చుక్కా రామయ్య గారు ముఖ్యులు. మా గురువర్యులు శ్రీ మోతుకూరి నరహరి గారి ద్వారా వారితో పరిచయం ఏర్పడినా ఇప్పటికీ నాలుగు దశాబ్దాలుగా వారితో నా అవినాభావ సంబంధం కొనసాగుతుంది. ముఖ్యంగా రామయ్య గారి చిన్నబ్బాయి అచ్యుత్ కు తెలుగు బోధించడం వల్ల వారింట్లో గాని, వారి పరిచయస్తులలో గాని నా అసలు పేరు మరుగుపడి తెలుగు సార్ అన్న పేరే స్థిరపడింది. చైతన్యానికి చిరునామా అయిన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు వారి జన్మస్థలం. నన్నయ్య నుండి సంప్రదాయ బద్ధంగా వస్తున్న మార్గ కవితను కాదని దేశీ కవితకు పట్టం కట్టిన మహాకవి పాల్కురికి సోమనాథుడు, తన రచనలను నరాంకితం చేయకుండా నారాయణ అంకితం చేసిన భక్తకవి బమ్మెర పోతన, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య, షేక్ బందగి మొదలైన వారందరూ రామయ్య గారి చుట్టుప్రక్కల గ్రామాలకు చెందినవారు. వారి వ్యక్తిత్వాన్ని, సైద్ధాంతిక నిబద్ధతను దగ్గర నుంచి గమనించినప్పుడు ఆ ప్రభావం ఉన్నట్లు కనబడుతుంది. సాయుధ పోరాటంలోను, సామాజిక ఉద్యమాలతోను, విద్యా రంగంతోనూ ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా వివిధ వర్గాలతో ఆయనకు విడదీయలేని సంబంధం ఉంది. అదీ ఆయన ప్రత్యేకతగా చెప్పవచ్చు.

రామయ్య గారు ఎంతటి ఉన్నత విద్యావంతులో అంతటి నిరాడంబరులు. మేధ స్పందన శాస్త్రమైతే హృదయ స్పందన సాహిత్యం అనేవారు. అప్పుడప్పుడు వారు ఇంట్లో లెక్కలు చేస్తూ అలసిపోయినప్పుడు దాశరథి, జాషువా పద్యాలను చదివి వినిపించమనేవారు. ముఖ్యంగా దాశరథి గారి

"చింతల తోపులో... అగ్ని గీతములో", అలాగే జాషువా శ్రమజీవిని గూర్చి రాసిన
"వాని రెక్కల కష్టంబు లేని నాడు,
సస్యరమ పండి పులకింప సంశయించు,
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు,
భోజనము బెట్టు వానికి భుక్తి లేదు" అనే పద్యాలకు వారు ఎంతో చలించి పోయేవారు.

ఒకరోజు సార్ ఇంట్లో ముందు గదిలో కూర్చుని అల్లసాని పెద్దన రాసిన మను చరిత్రలోని వరూధిని ప్రవరాఖ్యుల ఘట్టానికి సంబంధించిన"ఎవ్వతెవీవు.. మొదలైన పద్యాలను రాగయుక్తంగా చదువుతున్న సమయంలో అప్పుడే ఇన్‌స్టిట్యూట్ నుండి వచ్చిన రామయ్య గారు వెనుక నుండి లోపలికి వెళ్తూ నా పద్యాలను విన్నారు. కాసేపటికి ఆయన బయటికి వచ్చి నువ్వు చదివిన పద్యాలు బాగున్నాయి. గొంతు బాగుందనీ చెప్పి నువ్వు ఈ పద్యాలను తరగతిలో పిల్లలకు పాఠంగా ఎలా చెప్తావు? అని ప్రశ్నించారు. సర్! పద్యాలను రాగ యుక్తంగా పాడి ప్రతిపదార్థాన్ని రాయించి భావాన్ని చెబితే పిల్లలకు పాఠం అర్థమవుతుంది. దాంతో వాళ్లకు మంచి మార్కులు వస్తాయి అన్నాను. దాంతో రామయ్య గారు అది విని నా అభిప్రాయం సరికాదని అడ్డంగా తల ఊపుతూ"ప్రవరాఖ్యుడు తన కళ్ళ ముందు అంత ఆకర్షణ ఉన్న లొంగలేదు! అదయ్యా నువ్వు చెప్పాల్సిన పాఠం. పిల్లలలో పెంచాల్సిన వ్యక్తిత్వం" అనగానే ఒక్కసారిగా చలించిపోయాను. అంతవరకు ఆయనను ఒక గణిత శాస్త్రజ్ఞులు, స్వాతంత్ర్య సమరయోధులుగా సశేభావించానే కానీ సాహిత్యానికి సామాజిక ప్రయోజనమే ప్రధానమన్న ఆయన హితబోధ నన్ను కదిలించింది. అప్పటినుంచి భాషోపాధ్యాయునిగా, నా బోధన ప్రవంతిని, ఆలోచన దృక్పథాన్ని మార్చుకున్నాను. మలచుకొన్నాను. అలా నాకు ఒక నూతన దర్శనాన్ని అందించిన మార్గదర్శి, స్ఫూర్తి ప్రదాత రామయ్య గారు.

సాహిత్యం సమాజానికి అతీతమైనది కాదని కవులకు, రచయితలకు సమాజం పట్ల సామాజిక సమస్యల పట్ల అవగాహన, బాధ్యత అవసరమని చెబుతూ నా ఉద్యోగ, సాహిత్య జీవితాన్ని మలుపు తిప్పారు. గోర్కి అమ్మ, దాశరథి రంగాచార్య మోదుగు పూలు, చిల్లర దేవుళ్ళు, వట్టి కోట ప్రజల మనిషి, అంపశయ్య నవీన్ కాల రేఖలు, కళ్యాణరావు అంటరాని వసంతం, బోయ జంగయ్య జాతర మొదలైన నవలలతో పాటు కాళీపట్నం, రావిశాస్త్రి, మొదలైన వారి కథలను విశ్లేషణాత్మకమైన సామాజిక వ్యాసాలను గురించి వివరించేవారు. చలనశీలమైన సమాజంలోని పరిణామాలను గురించి రచయితలు లోతుగా విశ్లేషిస్తారని, వారి పరిశీలన పరిశోధనకు మార్గదర్శకమై శాస్త్ర సాంకేతిక రంగాలలో కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతుందని, అందువల్ల యువత విస్తృతంగా సాహిత్య అధ్యయనాన్ని చేయాలని కోరేవారు. ఆ రకంగా ఎన్నో పుస్తకాలను చదవడానికి నాకు అవకాశం కలిగింది. ఆ అధ్యయనానికి ప్రేరణ రామయ్య గారే అంటే అతిశయోక్తి కాదు.

రామయ్య గారితో ఏర్పడిన సాన్నిహిత్యం వలన వారి వెంట వందలాది ఊళ్ళు- స్కూళ్లు చూశాను. దాంతో తెలిసింది తక్కువ తెలియాల్సింది ఎక్కువ అని తేలిపోయింది. విద్యార్థులలో నైతిక విలువలను, దేశభక్తిని, జాతీయత స్ఫూర్తిని, సంస్కృతి నాగరికతల పట్ల అవగాహనను పెంపొందించడం కోసం 1997లో "సత్యవాణి"అనే శతకం రాశాను. తేదీ 23.6.1997 న పాలకుర్తిలో జరిగిన సాహిత్య సభలో మహాకవులు "ఉత్పల"వారు శతకాన్ని ఆవిష్కరించగా రామయ్య గారికి దానిని అంకితమిచ్చాను. నా ఆప్త మిత్రులు పల్లెర్ల రామ మోహన్ రావు గారు దానిని పరిచయం చేశారు. ఈ సభ నాకు ఒక తీపి గుర్తు. అలాగే పాలకుర్తి పరిసరాలలో జన్మించి వివిధ ప్రదేశాలలో స్థిరపడినా మూలాలను, మూల్యాలను మరువని మహనీయులను గూర్చి "పాలకుర్తి ప్రముఖులు" పేరున ఒక పుస్తకాన్ని స్థానికులకు,యువతకు అక్కడి మహోకవులను గురించి తెలియాలనే తపనతో "సోమన- పోతన" అనే పుస్తకాన్ని రాశాను. కాగా అప్పటి శాసనసభ్యులు డాక్టర్ ఎన్. సుధాకర్ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, చుక్క రామయ్య గారు ఆ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సమయంలోనే వివిధ కార్యక్రమాలకు కోసమై పాలకుర్తి ప్రాంతానికి వచ్చి వెళుతున్న రామయ్య గారు ఇక్కడి పాఠశాలల పనితీరును పరిశీలించి విద్యార్థులను ప్రోత్సహించడం కోసమై పదో తరగతిలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తానని ప్రకటించారు. అది ప్రకటించిన ముహూర్త బలమో విద్యార్థుల పట్టుదలో కానీ అప్పటినుండి ఏటా విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు.

పాలకుర్తి ప్రాంతంలో ఈ పత కాల ప్రదానోత్సవం పండగగా కొనసాగింది. ఇటీవల గ్రేడింగ్ సిస్టం వచ్చిన తర్వాత దానిని ఆపేశారు. ఈ కార్యక్రమ నిర్వహణలో నేనొక కార్యకర్తగా పాల్గొన్నందుకు ఆనందిస్తున్నాను. రామయ్య గారు తన తరగతి గదికి ఎంత సంసిద్ధతతో వెళ్తారో అలాగే సభలకు కూడా అంతే సంసిద్ధతతో వెళ్తారు. విషయాన్ని సిద్ధాంతీ కరించి వివరించడంలో ఆయన వివేచన, వింగడింపు, విశ్లేషణ అన్నవి ఎంతో ఆసక్తి దాయకంగా ఉండేది. ఇంతటి అనుభవ శీలి అయినా రామయ్య గారి జీవన రేఖలు గురించి సంక్షిప్తంగా నైనా సమాజానికి అందించాలనే లక్ష్యంతో 2011 లో నేను రాసిన "ఉద్యమ జీవి- చుక్క రామయ్య" అనే పుస్తకానికి ముందు మాట రాస్తూ ప్రముఖ పాత్రికేయులు పొత్తూరు వారు "విద్యారంగంలో కృషిచేసి జాతీయస్థాయిలో కీర్తి గడించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని పండితుడు, విమర్శకుడు అన్నారు గానీ విద్యావేత్త కట్టమంచి అనలేదు. వైస్ ఛాన్సెలర్ పనిచేసిన కట్టమంచి రామలింగారెడ్డి గారిని పండితుడు, విమర్శకుడు అన్నారు గానీ విద్యావేత్త కట్టమంచి అనలేదు. ప్రజలు ఒక్క రామయ్య గారిని మాత్రమే "ఐ.ఐ.టీ. రామయ్య" అంటూ ఆ పేరును స్థిరపరిచి ఆయన పట్ల తమ ప్రేమను, అభిమానాన్ని గౌరవాన్ని చాటుకున్నారని" చెప్పిన మాటలు అక్షర సత్యాలు. 20- 11 -2026న ఆయన నిండు నూరేళ్ల పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక విశ్లేషకులు,అధికార, అనధికార ప్రముఖులు బంధుమిత్రులు రామయ్య జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, సామాజిక తత్వాన్ని విశ్లేషిస్తూ ప్రముఖ పాత్రికేయులు,కె.రామచంద్ర మూర్తి గారి సంపాదకత్వంలో రాసిన" మన చుక్కా రామయ్య" పందేళ్ళ పండుగ పుస్తకాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు ఆవిష్కరిస్తున్నారు. రామయ్య జీవితం భవిష్యత్తు తరానికి ఒక పాఠ్య పుస్తకం. అభినందనలు.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
9989148305

ఆత్మగౌరవ వివాహాలు..
సమానత్వానికి కొత్త బాట

పెళ్లంటే భాజభజంత్రీలు, వేదమంత్రాలు, పురోహితులు, యజ్ఞాలు, యాగాలు, అంగరంగ వైభవంగా జరిగే వేడుకగా మారింది. పెళ్లి పేరుతో లక్షల రూపాయలు ఖర్చులు, అప్పుల ఊబిలో కూరుకుపోవడం, కుల సంప్రదాయాల పేరుతో సామాజిక అంతరాలను కొనసాగించడం వంటివి నేటి వివాహ వ్యవస్థలో భాగమైపోయాయి. అయితే ఇద్దరు వ్యక్తులు పరస్పరం అంగీకారంతో, సమాన హక్కులతో జీవితాంతం కలిసి జీవించాలని నిర్ణయించుకోవడమే వివాహానికి అసలైన అర్థం. ఈ భావనను మరోసారి సమాజం ముందుకు తీసుకొచ్చింది ఆత్మగౌరవ వివాహ(సెల్ఫ్ రెస్పెక్ట్ మ్యారేజ్) సంప్రదాయం. ఇటీవల ప్రముఖ తమిళ సంగీత స్వరకర్త అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మారన్ నవంబర్ 11న గ్రీస్‌లో ఆత్మగౌరవ వివాహం చేసుకున్నారు. వారి వివాహం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో జరిగింది. అయితే ఈ వివాహం ప్రత్యేకత ఏమిటంటే సంప్రదాయ హిందూ వివాహ కర్మకాండలకు బదులుగా ఆత్మగౌరవ వివాహ పద్ధతిలో జరిగింది. పురోహితులు, వేదమంత్రాలు, మతపరమైన క్రతువులు లేకుండా ఒకరికొకరు పూలమాలలు, గొలుసులు మార్చుకుంటూ తమ జీవిత భాగస్వాములుగా అంగీకరించారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆత్మగౌరవ వివాహాలపై చర్చ మొదలైంది.



ఆత్మగౌరవ వివాహాల ఆవిర్భావం

వాస్తవానికి ఆత్మగౌరవ వివాహం ఇప్పుడే పుట్టిన కొత్త ఆలోచన కాదు. దశాబ్ద కాలం నాటిది. ఆత్మగౌరవ వివాహాలు తమిళనాడులో సంఘ సంస్కర్త పెరియార్ ఈవీ రామస్వామి ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమం నుండి ఉద్భవించిన వివాహ పద్ధతి. కుల వివక్ష, సామాజిక అసమానత, సాంప్రదాయ పద్ధతులను సవాలు చేయడం ద్వారా సమానత్వ సమాజాన్ని సృష్టించడమే ఈ ఉద్యమం యొక్క లక్ష్యం. కుల వివక్ష, బ్రాహ్మణాధిపత్యం, స్త్రీలపై పితృస్వామ్య ఆధిపత్యం, మూఢాచారాలను ప్రశ్నిస్తూ... వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల పరస్పర అంగీకారం, సమానత్వం, గౌరవంపై ఆధారపడాలని పెరియార్ ఉద్యమం చాటిచెప్పింది. అభ్యుదయ ఆలోచనతో కూడిన ఈ సంస్కరణాత్మక వివాహాలకు 1967లో తమిళనాడు ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపునిచ్చింది. హిందూ వివాహ చట్టం1955లోని సెక్షన్ 7-ూూ ద్వారా ఆత్మగౌరవ, సంస్కరణాత్మక వివాహాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించింది. ఆత్మగౌరవ వివాహ పద్ధతిలో బంధువులు, స్నేహితులు లేదా సాక్షుల సమక్షంలో పరస్పరం అంగీకారం ప్రకటించడం, పూలమాలలు లేదా ఉంగరాలు మార్చుకోవడం ద్వారా వివాహాన్ని నిర్వహించుకోవచ్చు. ఇటీవలి కాలంలో తెలంగాణ రాష్ట్రంలో జంబుద్వీప జన జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక వివాహాలు కూడా ఆత్మగౌరవ వివాహాలకు ప్రతిరూపాలే.

సామాజిక వివాహాలు - జంబుద్వీప స్ఫూర్తి

ఒకప్పుడు భారతదేశం జంబుద్వీపంగా పిలువబడేది. జంబుద్వీప రాజ్యాన్ని ఆదిజాంబవంతుడు గణతంత్ర విలువలతో పరిపాలించాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆ రాజ్యానికి పునాదులు. అక్కడ జరిగే వివాహాలన్నీ ఆత్మగౌరవంతో కూడిన సామాజిక వివాహాలే. బహుజనుల గత సంప్రదాయాలను పరిశీలిస్తే..వారి కుటుంబాల్లో జరిగే వివాహాలను పురోహితులు నిర్వహించేవారు కాదు. కుల పెద్దల సమక్షంలో, వధూవరుల పరస్పర అంగీకారంతో వివాహాలు జరిగేవి. అయితే ఇటీవలి కాలంలో పురోహితుల ప్రవేశం పెరిగింది. సామాజిక వివాహ వ్యవస్థలో కుల వివక్ష, మతపరమైన ఆధిపత్యం, ఆర్థిక ఆడంబరాలకు తావులేకుండా పరస్పర గౌరవం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ పునాదులపై ఒక్కటవుతారు. ఫూలే, పెరియార్, అంబేద్కర్ వంటి మహనీయుల సామాజిక పరివర్తన

ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- ఈ నెల 20 నుంచి ప్రత్యేక శిబిరాల్లో నమోదు
- ఆహార భద్రత కార్డుదారులకే ప్రస్తుతానికి అవకాశం
- జిల్లాలో ఎక్కడైనా వివరాలు నమోదు చేసుకోవచ్చు : కలెక్టర్ ఇలా త్రిపాఠి
- మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్ల పరిశీలన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 19 (జనం సాక్షి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పథకం అమలు ఏర్పాట్లపై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20 నుంచి అన్ని మున్సిపల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లోని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆహార భద్రత కార్డులు కలిగిన కుటుంబాల వారికే ఈ పథకంలో అవకాశం ఉంటుందని తెలిపారు. కార్డు నంబరు ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని, కుటుంబ సభ్యులు, నామినీలు, వయసు, బంధుత్వ వివరాల్లో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బీమా పొందే వ్యక్తి స్వయంగా శిబిరానికి హాజరై వివరాలు అందించాల్సి ఉంటుందని, నామినీలు రావాల్సిన అవసరం లేదన్నారు. లబ్ధిదారులు జిల్లాలో ఎక్కడైనా తమకు అనుకూలమైన శిబిరంలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శిబిరాల్లో హెల్ప్‌డెస్క్‌లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించాలని, ఎంపీడీవోలు ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. నమోదైన వివరాలను రోజువారీ నివేదికల రూపంలో పంపాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా, రాష్ట్ర మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్న చేయూత పింఛన్ల పంపిణీ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత కార్యక్రమాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, డీఆర్డీఏ అధికారి సాయన్న, ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

సిరికొండ నవంబర్ 19 (జనంసాక్షి): సిరికొండ ఎస్ఐ మరియు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, కొండాపూర్ గ్రామ శివారులోని కవిత రైస్ మిల్ వద్ద బియ్యం లోడుతో ఉన్న లారీ నం. ూూూ-24-ూూ-2140 అనుమానంతో తనిఖీ చేశారు. అనంతరం సివిల్ సప్లైస్ అధికారులు జి. వినోద్ (DT), ఎం. రవి (UDRI) సమక్షంలో పరిశీలించగా, 580 గన్నీ బస్తాలలో మొత్తం 273.50 క్వింటాళ్ల సీఎంఆర్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. విచారణలో కవిత రైస్ మిల్‌కు సీఎంఆర్ మిల్లింగ్ చేయడానికి అనుమతులు లేవని, మిల్లు బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నట్లు వెల్లడైంది. అయినప్పటికీ స్థానికంగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లింగ్ చేసిన బియ్యాన్ని నిర్మల్ జిల్లాలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఇండస్ట్రీస్ పేరుతో ఎఫ్‌సీఐకి తరలిస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత ధాన్యం కొనుగోలు రసీదులు, బి-రిజిస్టర్, మిల్లింగ్ అనుమతులకు సంబంధించిన పత్రాలను చూపించలేకపోయారు. దీంతో పంచుల సమక్షంలో 273.50 క్వింటాళ్ల బియ్యం, లారీని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ సుమారు రూ.13.62 లక్షలు లారీ విలువ సుమారు రూ.10 లక్షలుగా అంచనా బియ్యం నమూనాలను సేకరించి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని భద్రత నిమిత్తం తిరుమల రైస్ మిల్, మైలారం వద్ద భద్రపరిచారు. ఈ అక్రమ వ్యవహారంలో కవిత రైస్ మిల్ యజమాని రవీందర్ గౌడ్ మరియు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఇండస్ట్రీస్ యజమాని గొల్లపల్లి నర్సాగౌడ్‌లపై కేసు నమోదు చేసి ప్రభుత్వ బియ్యం అక్రమ రవాణా, మిల్లింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిరికొండ ఎస్ఐ రామకృష్ణ. హెచ్చరించారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరగలేదు

- అడిషనల్ డీఆర్‌డీఓ విచారణలో వెల్లడి
- ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణల్లో వాస్తవం లేదన్న కూలీలు
- 80 మంది కూలీలను విచారించిన అధికారి
- వ్యక్తిగత భూ తగాదాలతో తప్పుడు ఫిర్యాదులు సరికాదని హితవు
- అధికారుల సమయం, కూలీల శ్రమ వృథా చేయొద్దని సూచన



చిగురుమామిడి, నవంబర్ 19 (జనం సాక్షి): ముదిమాణిక్యం గ్రామంలో వి.బి.జి. రాంజీ (ఉపాధి హామీ) పనుల్లో బినామీ హాజర్లు నమోదు కాలేదని, ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని అడిషనల్ డీఆర్‌డీఏ కృష్ణ చేపట్టిన విచారణలో వెల్లడైంది. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పచ్చిమట్ల మధుసూదన్ గౌడ్ బినామీ హాజర్లు నమోదు చేస్తున్నారంటూ గారబోయిన బాలమల్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఫిర్యాదుదారుడు, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీల సమక్షంలో బహిరంగ విచారణ నిర్వహించారు.
మస్టర్లలో నమోదైన సుమారు 80 మంది కూలీలను అధికారి స్వయంగా విచారించారు. పనులకు హాజరైన వారికే హాజరు నమోదు చేశారని, ఎలాంటి అక్రమాలు జరగలేదని కూలీలు స్పష్టం చేశారు. వ్యక్తిగత భూ గెట్టు వివాదాన్ని మనసులో పెట్టుకుని ఫిర్యాదు చేశారని ఆరోపించారు. తమకు నిరంతరం పనులు కల్పిస్తూ సహకరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత కక్షలతో తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారుల సమయాన్ని వృథా చేయడంతోపాటు కూలీలను ఇబ్బందులకు గురిచేయవద్దని అడిషనల్ డీఆర్‌డీఏ కృష్ణ హితవు పలికారు. భూ వివాదం నేపథ్యంలోనే ఫిర్యాదు చేసినట్లు విచారణలో ఫిర్యాదుదారుడు పేర్కొన్నట్లు తెలిసింది. కార్యక్రమంలో సర్పంచ్ బోయిని రమేష్, ఎంపీడీవో రామ్మోహనచారి, ఏపీవో రాజు, టీఏ శ్రీనివాస్, గ్రామస్థులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

బల్దియాకు చైర్మనే బాస్.. ఎమ్మెల్యేకు ఆ అధికారం లేదు

- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే వ్యవహారశైలిపై టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర విమర్శలు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (జనం సాక్షి): కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో చోటుచేసుకున్న వివాదంపై టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి స్పందించారు. మున్సిపాలిటీకి చైర్మనే అధిపతి అని, ఎమ్మెల్యేకు కౌన్సిలర్లను సమావేశం నుంచి బయటకు పంపించే అధికారం లేదని స్పష్టం చేశారు. గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న 40 అంశాలతో జరిగిన మున్సిపల్ సమావేశం వాయిదా పడిన అనంతరం బుధవారం తిరిగి అదే ఎజెండాతో సమావేశం నిర్వహించారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ వనితను బయటకు పంపాలని ఎమ్మెల్యే సూచించడం సరికాదన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం సమావేశాన్ని నిర్వహించే అధికారం చైర్మన్‌కే ఉంటుందని పేర్కొన్నారు.
సమావేశానికి గన్‌మెన్లతో హాజరై కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీలో అవినీతి, అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తే వాటికి సంబంధించిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. అవినీతిని నిరూపిస్తే తాము కూడా సహకరిస్తామని తెలిపారు.
ఎమ్మెల్యే బెదిరింపులకు దిగడం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మున్సిపాలిటీకి నిధులు తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, మెహర్ బాబాగౌడ్, బండారు శ్రీకాంత్, అబీద్, మాజీ కౌన్సిలర్లు వంశీ, సాయిబాబా, మున్ను, సయ్యద్ అహ్మద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్
- మార్కెట్ యార్డు, బొమ్మకల్‌లో కేంద్రాల ప్రారంభం
- దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం నగరపాలక సంస్థ పరిధిలోని బొమ్మకల్‌లో కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి మరో కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం తూకం వేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని తేమశాతం లేకుండా ఆరబెట్టి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కార్పొరేటర్లు మేకల వెంకటేష్, గాదె రూప శ్రీనివాస్, నాయకులు పురుమల్ల శ్రీనివాస్, రాంరెడ్డి, డైరెక్టర్లు బీరం ఆంజనేయులు, సాయిల్ల మహేందర్, బోనాల లింగయ్య, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నామాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

నిర్మాణానికి 20 ఎకరాల భూమి గుర్తింపు.. అధికారులకు భూమి అప్పగింత

ముస్తాబాద్, నవంబర్ 19 (జనం సాక్షి): సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో నిర్మించనున్నారు. పాఠశాల నిర్మాణం కోసం సుమారు 45 రోజుల పాటు భూ సర్వే నిర్వహించి 20 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అనంతరం ఆ భూమిని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా పాఠశాలను నియోజకవర్గానికి మంజూరు చేయించడంలో కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి గ్రామ సర్పంచ్ మాదాస్ అనిల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పాఠశాల నిర్మాణానికి భూమి కేటాయింపు ప్రక్రియలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు.

కేసీఆర్ పోరాట స్ఫూర్తిని నేటి యువతకు చాటాలి

- దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి: బాల్క సుమన్
- నవంబర్ 29న అలుగునూర్‌లో దీక్షా దివస్ బహిరంగ సభ
- ఎద్దపల్లి పార్లమెంట్ పరిధి నుంచి భారీగా తరలిరావాలి



మంథని, నవంబర్ 19 (జనం సాక్షి): చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాట స్ఫూర్తిని నేటి యువతకు చాటాలని మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. నవంబర్ 29న కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ బహిరంగ సభ సన్నాహక సమావేశం మంథని పట్టణంలోని బీఎస్ బాంకెట్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బాల్క సుమన్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసేవ, రాష్ట్ర ప్రగతి కోసం పనిచేయాలని అన్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూర్‌లోనే దీక్షా దివస్ సభ నిర్వహిస్తున్నామని, కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.
తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని వివరించారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ప్రశ్నిస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన కేసీఆర్‌ను పోలీసులు అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించారని గుర్తుచేశారు. ఆయన దీక్ష, ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలవలేదని బాల్క సుమన్ విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో అభివృద్ధి వెనుకబడిందని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధనకు కేసీఆర్ చేసిన పోరాటం, త్యాగాలను యువతకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంథని, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని కోరారు.

మర్రికుంట చెరువు ఆక్రమణలపై సర్వే చేపట్టాలి

తహశీల్దార్‌కు సర్పంచ్ పిట్ల బాబు వినతి

గంభీరావుపేట, నవంబర్ 18 (జనం సాక్షి): రాజేశ్వరరావుకాలనీలోని మర్రికుంట చెరువు ఆక్రమణలపై సమగ్ర సర్వే నిర్వహించి భూమిని పరిరక్షించాలని గ్రామ సర్పంచ్ పిట్ల బాబు తహశీల్దార్ మారుతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని 261 సర్వే నంబర్‌లో మర్రికుంట చెరువుకు మొత్తం 16 ఎకరాల 37 గుంటల భూమి ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం నాలుగు ఎకరాలు మాత్రమే చెరువు పరిధిలో ఉందన్నారు. మిగతా 12 ఎకరాల 37 గుంటల భూమి ఆక్రమణకు గురైందని, చుట్టుపక్కల రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అధికారులు వెంటనే సర్వే చేపట్టి చెరువు హద్దులను గుర్తించాలని, బౌండరీ ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించాలని కోరారు. మర్రి కుంట చెరువును రాజేశ్వరరావుకాలనీ బతుకమ్మ చెరువుగా అభివృద్ధి చేసి గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భార్య వేధింపుల కేసులో భర్త అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

- మరో మహిళతో సంబంధం పెట్టుకుని వేధించినట్లు పోలీసుల విచారణలో వెల్లడి
- ఇద్దరు కుమార్తెలు ఉండగానే భార్యను వేధించిన భర్త
- చాటింగ్స్, వీడియో కాల్స్ గుర్తించిన పోలీసులు
- నిందితుడి ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం



కరీంనగర్, క్రైమ్, నవంబర్ 19 (జనంసాక్షి): ఇరుకుల్ల గ్రామంలో వివాహిత శ్రావంతి ఆత్మహత్య ఘటనకు సంబంధించి ఆమె భర్త కొత్తూరి సంపత్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో మహిళతో సంబంధం కొనసాగిస్తూ భార్యను వేధించడంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వరంగల్ జిల్లాకు చెందిన ఇమ్మడి ముత్తయ్య తన కుమార్తె శ్రావంతిని 11 ఏళ్ల క్రితం ఇరుకుల్ల గ్రామానికి చెందిన సంపత్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే గత రెండేళ్లుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలానికి చెందిన ఓ మహిళతో సంపత్ పరిచయం పెంచుకుని సంబంధం కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తనను వివాహం చేసుకోవాలంటే భార్యను వదిలించుకోవాలని ఆ మహిళ ఒత్తిడి చేసినట్లు విచారణలో వెల్లడైంది.నవంబర్ 9న రాత్రి సంపత్ మరో మహిళతో వీడియో కాల్స్, చాటింగ్ చేస్తుండటాన్ని గమనించిన శ్రావంతి భర్తను నిలదీసింది. దీంతో తాను మరో మహిళను ప్రేమిస్తున్నానని, ఆమెనే పెళ్లి చేసుకుంటానని చెబుతూ దురుసుగా మాట్లాడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రావంతి మరుసటి రోజు ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటన అనంతరం తనపై అనుమానం రాకుండా సంపత్ ఫోన్‌లోని చాటింగ్స్, మెసేజ్‌లను తొలగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి పరారీలో ఉన్న సంపత్ కోసం గాలించారు. బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలోని జైలు బంక్ వద్ద అతడు ఉన్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నారు. అతడి మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా మరో మహిళతో జరిపిన చాటింగ్స్, మెసేజ్‌లు, వీడియో కాల్స్ వివరాలు లభించాయి. మొబైల్ ఫోన్‌తో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి

మెట్‌పల్లి, నవంబర్ 19 (జనం సాక్షి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 14 నుంచి 27 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు రోజుకో రూపంలో విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటి వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలు, చట్టపరమైన పరిణామాలపై ఉపాధ్యాయులు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 (న్యాయ సహాయం), 1933 (మాదకద్రవ్యాల నియంత్రణ), 14446 (పునరావాస సహాయం) హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్య రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు, పాఠశాల కరస్పాండెంట్ ఎన్నమనేని రామారావు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- పార్టీలకు అతీతంగా.. పైరవీలకు తావులేకుండా అమలు
- 504 మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు
- రూరల్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి
- మరో 2,500 ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు
- మహిళా సాధికారత, రైతు సంక్షేమానికి ప్రాధాన్యం



సిరికొండ, నవంబర్ 19 (జనం సాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా, ఎలాంటి పైరవీలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి అన్నారు. గురువారం సిరికొండ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన 504 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. వీటిలో 304 వితంతువులు, 65 ఒంటరి మహిళలు, 132 మంది దివ్యాంగులు, ముగ్గురు గీత కార్మికులు ఉన్నారని తెలిపారు. దివ్యాంగులకు నెలకు రూ.4,016, ఇతరులకు రూ.2,016 చొప్పున పింఛన్ అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 20 వేలకు పైగా, రూరల్ నియోజకవర్గంలో 3,500 మందికి పైగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు.
నియోజకవర్గాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 2,500 ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సొంత స్థలం లేని నిరుపేదలకు 75 గజాల స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ పెట్రోల్ బంకులు, బస్సుల నిర్వహణ, ఇతర వ్యాపారాల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, రెండో పంటగా వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనిదినాలను 100 నుంచి 150 రోజులకు పెంచినట్లు తెలిపారు. తెలంగాణకు రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అందుబాటులో ఉండాలి.. మెరుగైన వైద్యం అందించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ

రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 19(జనంసాక్షి); వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఓపీకి ఎంత మంది వస్తారని ఆరా తీశారు.ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, వ్యాక్సిన్లు, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఫార్మసీ, ఆసుపత్రి ఆవరణలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏ.ఎన్.ఎం. లతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఏ.ఎన్.సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణీల ఆరోగ్య విషయాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని సూచించారు.ఎన్.సీ.డీ స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీని ద్వారా ముందు గానే వ్యాధి లక్షణాలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణం, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 నవంబర్ 2026

డ్రగ్స్, గంజాయి అక్రమ సాగు,కల్తీ కల్లు విక్రయాలపై ఉక్కుపాదం

● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ, నవంబర్ 19 (జనం సాక్షి) : జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, గంజాయి సాగు, కల్తీ కల్లు తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క డ్రగ్ కేసు కూడా నమోదు కాకుండా పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర నిషేధిత మాదకద్రవ్యాల సాగు, నిల్వ, విక్రయాలు, రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాయచూరు సరిహద్దు ప్రాంతంలోని మండలాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గట్టు,కేటీ దొడ్డి, గద్వాల,ఐజ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాల ప్రయోజనాల నిలిపివేత వ్యవసాయ భూముల్లో గంజాయి లేదా ఇతర నిషేధిత మాదకద్రవ్యాలకు సంబంధించిన మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత భూముల వివరాలను సేకరించి, పోలీస్ శాఖ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కల్తీ కల్లు విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

కల్తీ కల్లు తయారీలో ప్రమాదకరమైన రసాయనాలు వినియోగిస్తున్నట్లు వచ్చే ఫిర్యాదులపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు కలిగిన కల్లు విక్రయ కేంద్రాల్లో కూడా నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా తనిఖీలు చేయాలని, కల్తీ కల్లు తయారీ, విక్రయాలు ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా సరిహద్దు గ్రామాలు, ప్రధాన రహదారులు, అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, గంజాయి సాగు వంటి కార్యకలాపాలపై విశ్వసనీయమైన, నిర్ధారించగల సమాచారం అందించే వారికి రూ.10,000 నగదు బహుమతి అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. ప్రజలు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని, సమాచారం అందించే వారి వివరాల గోప్యతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.

పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాలు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా 16 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యా సంస్థలో యాంటీ నార్కోటిక్స్ అవగాహన కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

డీ-అడిక్షన్ కేంద్రాల సేవలు విస్తరించాలి

మాదకద్రవ్యాలు, మద్యం వ్యసనాలకు గురైన వారికి అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. డీ-అడిక్షన్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని పునరావాస కేంద్రాలకు పంపించాలని, చికిత్స అనంతరం వారి పరిస్థితిని తిరిగి పర్యవేక్షించాలని తెలిపారు.

రెస్టారెంట్లు, దాబాల్లో ఆహార భద్రత తనిఖీలు

జిల్లాలోని జాతీయ రహదారుల వెంట ఉన్న రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఆహార భద్రతా ప్రమాణాలను నిరంతరం తనిఖీ చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎస్పీ మొగిలయ్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పోలీస్, ఎక్సైజ్, వ్యవసాయ, రెవెన్యూ, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోరితే అరెస్టులా..?

● అరెస్టులను ఖండించిన సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్



బెజ్జంకి, నవంబర్ 19 (జనం సాక్షి) : ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని కోరుతూ నిరసన తెలిపేందుకు వెళ్తున్న సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ విమర్శించారు.గురువారం సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో నిరసన తెలిపేందుకు బయలుదేరిన సీపీఎం నాయకులను బెజ్జంకి పోలీసులు రేగులపల్లి రాజీవ్ రహదారి వద్ద అడ్డుకుని అరెస్టు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బెజ్జంకి మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని ప్రజలు కొంతకాలంగా ఆందోళనలు,ధర్నాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేటకు బయలుదేరగా పోలీసులు అరెస్టు చేయడం దారుణమని అన్నారు.అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని పేర్కొన్నారు.వెంటనే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ,భువనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలోనే పేదోడి సొంతింటి కల సాకారం



నారాయణపేట, నవంబర్ 19 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రజా పాలనలోనే పేదోడి సొంతింటి కల సాకారం అవుతున్నదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి అన్నారు.నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నారాయణపేట మండలంలోని బోయిన్పల్లి తాండ గ్రామంలో ఇందిర మ్మ నూతన ఇంటి గృహప్ర వేశంలో సదాశివ రెడ్డి, మండల ప్రెసిడెంట్ కోట్ల రవీందర్ రెడ్డి, బోయిన్పల్లి తాండ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ పాల్గొని లబ్ధిదారు లకు అభినందనలు తెలి పారు.ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి గ్రామ నాయ కులు వెంకటయ్య రాము లు సీనియర్ నాయకులు రామచందర్ గౌడ్, పంచా యతీ సెక్రెటరీ గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

● నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తీరుకు నిరసనగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

● ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

● కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి) : నాగర్‌కర్నూల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ప్రిన్సిపాల్ వేధింపులకు పాల్పడుతున్నారంటూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో గురువారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. దళిత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని షోకాజ్ నోటీసుల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కేవీపీఎస్ నాయకులు, బాధిత ఉద్యోగులు ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగుల పట్ల వివక్షాపూరిత వైఖరిని విడనాడాలని, వేధింపులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడుతూ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సమంజసం కాదని విమర్శించారు. ముఖ్యంగా దళిత, బహుజన ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వివిధ కారణాలతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. షోకాజ్ నోటీసుల పేరుతో ఉద్యోగుల్లో భయాందోళనలు సృష్టిస్తూ, వారి ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు.ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా ఎలాంటి వివక్షకు తావులేకుండా విధులు నిర్వహించే వాతావరణం కల్పించాలని అన్నారు. ఉద్యోగులతో గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని, కానీ ప్రిన్సిపాల్ వ్యవహారశైలి కారణంగా ఉద్యోగులు తీవ్ర అభద్రతాభావానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రిన్సిపాల్ తన వైఖరిని తక్షణమే మార్చుకోవాలని, దళిత, బహుజన ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలకాలని కాశన్న డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగేలా జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని కళాశాలలో నెలకొన్న పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారనే



ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపాల్‌ను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఆత్మగౌరవంతో పనిచేసే పరిస్థితులు కల్పించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా, ఉద్యోగులపై వేధింపులు కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలను ఐక్యం చేసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కేవీపీఎస్ నాయకులు హెచ్చరించారు.

విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. ప్రతాప్



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి) : విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యతో పాటు విస్తృతమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. ప్రతాప్ సూచించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు వివిధ రంగాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం వారోత్సవాల ఆరవ రోజు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాలల విద్యార్థినులకు ముగ్గుల (రంగోలి) పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. ప్రతాప్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న వివిధ రంగాల్లో ప్రత్యేక అభిరుచిని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు, విజ్ఞాన సమాచారాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞాన పరిధిని విస్తరించుకోవాలని అన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే వివిధ పోటీ పరీక్షలపై ఆసక్తి పెంచుకొని, వాటిలో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను పరీక్షించుకోవాలని సూచించారు. చదువుతో పాటు సృజనాత్మకత, ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలను కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలుగా కాకుండా, విజ్ఞానాన్ని సంపాదించే కేంద్రాలుగా భావించి వాటిని నిరంతరం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయురాలు కల్పన, జిల్లా కేంద్ర గ్రంథాలయ గ్రంథపాలకురాలు ఆర్. పరమేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది కర్నె వెంకటేష్, తాజుద్దీన్, శ్రీకాంత్, కమర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపండి

● అక్రమ రవాణాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంకకు బీజేపీ రాష్ట్ర నాయకుడు బి. కొండయ్య వినతి



మక్తల్, నవంబర్ 19 (జనంసాక్షి) : మక్తల్ నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక దోపిడీకి తక్షణమే అడ్డుకట్ట వేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ బి. కొండయ్య డిమాండ్ చేశారు. ఇసుక మాఫియాతో పాటు, వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంకను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పరిస్థితులను కొండయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాల్లో అనుమతుల ముసుగులో పట్టపగలే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, రాత్రి వేళల్లో అయితే అడ్డూఅదుపు లేకుండా దోపిడీ కొనసాగుతోందని వివరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సహజ సంపదను కొల్లగొడుతుంటే సంబంధిత అధికారులు చోద్యం చూడటం సరికాదని మండిపడ్డారు. ఈ అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత కలిగిన స్థానిక మంత్రి సైతం మౌనంగా ఉండటంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ?ప్రజా సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికారులదని, అక్రమ దోపిడీని అడ్డుకోవాల్సిన బాధ్యత పాలకులదని కొండయ్య పేర్కొన్నారు. సహజ సంపదను దోచుకుంటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ, బాధ్యులపై తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



హత్నూర, నవంబర్ 19 (జనం సాక్షి) : ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిరిపుర గ్రామ సర్పంచి భూపాల్ రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం 42 చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. పేద, బడుగు, బలహీనంగా వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కారు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వారు తెలిపారు.అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి చేయూత పెన్షన్ అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు.

కేతకీ ఆలయాన్ని దర్శించిన అదనపు కలెక్టర్

● పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు

ఝరాసంగం, నవంబర్ 19 (జనం సాక్షి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ పాండు మండల రెవెన్యూ అధికారులతో కలిసి దర్శించుకున్నారు.అదనపు కలెక్టర్ కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన శివలింగానికి అభిషేకం నిర్వహించి పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అలయ అర్చకులు శాలువా పూలమాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.అదనపు కలెక్టర్ వెంట తహసిల్దార్ భాస్కర్, నయాబ్ తహసిల్దార్ రాజు గౌడ్ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

● బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (జనం సాక్షి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేలా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ దేవసహాయం కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీఎస్పీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్ మాట్లాడుతూ.. బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల హాస్టళ్లు, యూనివర్సిటీ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యతలేని భోజనం అందుతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని వసతి గృహాల్లో పురుగులు ఉన్న అన్నం, నాసిరకమైన ఆహారం అందించడం వల్ల విద్యార్థులు అనారోగ్యం, ఆహార విషబాధ వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేద, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుతో ముడిపడిన ఈ సమస్యపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని కోరారు.ఈ సందర్భంగా బీఎస్పీ ఆరు ప్రధాన డిమాండ్లను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాసంస్థల హాస్టళ్లలో తక్షణమే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, తాగునీరు, వంట సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక జిల్లా స్థాయి తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. పేద విద్యార్థుల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్యాన్ని బహుజన్ సమాజ్ పార్టీ ఎంతమాత్రం సహించదని, విద్యార్థుల హక్కులు, ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామని



హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, పార్లమెంట్ ఇన్‌చార్జి సి. కళ్యాణ్, జిల్లా ఈసీ సభ్యులు హర్ష ముదిరాజ్, అచ్చంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీకాంత్, నాగర్ కర్నూల్ అసెంబ్లీ నాయకులు కాకునూరి మధు, నాగరాజ్, దేవరపాగ రాముడు, జన్ను ఆంజనేయులు, కుందేటి రాములు, ఆగపు శంకర్, నల్లగంటి బాలరాజ్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఏ ఒక్క కుటుంబమూ దూరం కాకూడదు

□ కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు, లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ఉపాధి పొందే కుటుంబ సభ్యులను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. నమోదు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీ వివరాలు, మొబైల్ నంబర్ సేకరించాలని, అర్హులైన ఏ ఒక్క కుటుంబం దూరం కాకుండా పారదర్శకంగా నమోదు పూర్తి చేయాలని సూచించారు. గ్రామ, పట్టణ స్థాయిలో విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, సీపీఓ కిష్టయ్య, డీపీఓ శ్రీలక్ష్మీ, డీసీఎస్ఓ కిరణ్ కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రానికి కుడా కార్యాలయం తరలింపు

□ నూతన కార్యాలయాన్ని సందర్శించిన కుడా చైర్‌పర్సన్ జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (జనంసాక్షి) : హనుమకొండలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని బాల సముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం రెండవ, మూడవ అంతస్తులోకి తరలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయి సందర్శించారు. కార్యాలయ తరలింపు అనంతరం కుడా లోని ఆయా విభాగాల వారీగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాళోజి కళాక్షేత్రంలోని కుడా కార్యాలయం నుండి అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్‌రావుతోపాటు అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

□ రామకృష్ణాపురం నుంచి ధర్మారం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు ప్రత్యేక కార్యచరణ

□ లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసే మాటును పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



నడికూడ, నవంబర్ 19 (జనం సాక్షి) : గురువారం నడి కూడ మండలం రామకృష్ణాపురం నుండి ధర్మారం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు కంటాత్మకూర్ మాటును అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. మాటువాగు వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా ఈదుల్ చెరువు, బంటోనీ చెరువు, శాలకుంట చెరువులకు నీటిని అందించేందుకు ప్రతిపాదించిన మోటార్ పంపింగ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పథకం అమలు, సాగునీటి సౌకర్యాలపై స్థానిక రైతులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.ప్రభుత్వం ఈ పథకానికి 75 శాతం సబ్సిడీ అందిస్తుందని, రైతులు మిగిలిన 25 శాతం వాటాను సమష్టిగా భరించి సహకరించాలని కోరారు. రైతులందరూ కమిటీగా ఏర్పడి ఐకమత్యంతో ముందుకు వస్తే మూడు చెరువులను నీటితో నింపి సాగునీటి సౌకర్యం కల్పించవచ్చని, దీని ద్వారా రైతుల సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాణి సంబంధిత జిల్లా అధికారులు కంటత్మకూరు సర్పంచ్ కొంగోటి తిరుపతి రామకృష్ణాపురం సర్పంచ్ పెండ్లి లక్ష్మీరాజు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వంశీకృష్ణను అవమానించే రాజకీయాలు మానుకోవాలి

□ దళితుల మధ్య విభేదాలు సృష్టిస్తే సహించేది లేదు

□ మంత్రి శ్రీధర్ బాబుకు మాల మహానాడు నాయకుల హెచ్చరిక



నస్పూర్ (జనంసాక్షి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేపడుతున్న అభివృద్ధి,సేవా కార్యక్రమాలను మంత్రి శ్రీధర్ బాబు అడ్డుకోవడం మానుకోవాలని మాల మహానాడు మంచిర్యాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రోజున నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో మాలమహాడు జిల్లా చైర్మన్ నర్సింగ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావే శంలో జిల్లా నాయకులు పొట్ట మధుకర్, సుధమల అశోక్ తేజ మాట్లాడుతూ విద్యార్థుల కు కాకా వెంకటస్వామి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంపి వంశీకృష్ణ విద్యా సామగ్రి అందిస్తే తప్పేంటని ప్రశ్నించారు. సేవా కార్యక్రమాలకు హాజరైన ఎస్సీ,ఎస్టీ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం సరికాదన్నారు.వంశీకృష్ణను అవమానించే వ్యాఖ్యలు మానుకోవాలని, దళితుల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని మంత్రి శ్రీధర్ బాబును హెచ్చరించారు.ఎంపీ వంశీకృష్ణకు మాల మహానాడు పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నాయకులు నర్సింగ్,దమ్మ నారాయణ,భూపెల్లి మల్లన్న, పాముల వెంకటేష్,మాలెం చిన్నయ్య,దమ్మ సునీల్,గద్దల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత

□ వరంగల్ నూతన ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్. ప్రవీణ్

□ కార్యదర్శి డాక్టర్ వి. నరేష్ కుమార్

□ ఘనంగా ఐఎంఏ వరంగల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



వరంగల్ ఈస్ట్, నవంబర్ 19(జనంసాక్షి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. 2026-27 సంవత్సరానికి అధ్యక్షుడిగా డా. పి. ప్రవీణ్ – కార్యదర్శిగా డా. వి. నరేష్ కుమార్, ఆర్థిక కార్యదర్శి గా డా ముప్పిడి దిలీప్ కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్:డా టి.సనత్ కుమార్ తదితరులు బాధ్యతల స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. వి. విజయ్ కుమార్, గౌరవ అతిథులుగా రాష్ట్ర మాజీ అధ్యక్షులు డా. పి. కిషన్, రాష్ట్ర అధ్యక్ష ఎన్నికైన డా. సంజీవ్ సింగ్ యాదవ్, ఎన్నికైన డా. సి.హెచ్. జగన్ మోహన్ రావు, ఐఎంఏ జాతీయ తదుపరి అధ్యక్ష కార్యవర్గ యాక్షన్ కమిటీ చైర్మన్ డా. ఇ. రవీందర్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యాలయ ఆఫ్ గావో చలేన్ చైర్మన్ డా. పి. కాళీప్రసాద్ రావు, హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా. పి. విజయ్ చంద్ర రెడ్డి, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డా. టి.వి. శ్రీనివాస్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డా. జె. విజయ రావు, ఐఎంఏ తెలంగాణ జోన్-3 వైస్ ప్రెసిడెంట్ డా. పి. సుధీర్ కుమార్, జోన్-3 జాయింట్ సెక్రటరీ డా. బి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.ఈ సంవత్సరానికి నూతన కార్యవర్గం టీం సంకల్ప్ పేరుతో ఐకమత్యం, సేవ, వృత్తిపరమైన నిబద్ధత అనే లక్ష్యాలతో ముందుకు సాగనుంది.అధ్యక్షులు డా. పి. ప్రవీణ్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో తమ టీం పేరు సంకల్ప్‌గా ప్రకటించారు. అలాగే ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ప్రధాన కార్యదర్శి డా. వి. నరేష్ కుమార్ మాట్లాడుతూ, సభ్యుల సమస్యల పరిష్కారం, వైద్యుల హక్కులు, వైద్య వృత్తి గౌరవ పరిరక్షణ, ప్రజారోగ్య కార్యక్రమాల నిర్వహణకు కార్యవర్గ సభ్యులందరితో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. ప్రతి సభ్యుడి సూచనకు ప్రాధాన్యతనిస్తూ ఐఎంఏను మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ఐఎంఏ నాయకులు, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు, వైద్య ప్రముఖులు, ఐఎంఏ సభ్యులు, వివిధ వైద్య సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖేలో ఇండియా క్రీడలకు హనుమకొండ ముస్తాబు

□ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (జనం సాక్షి) : జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 అథ్లెటిక్స్ పోటీలకు ఆతిథ్యమివ్వనున్న హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియాన్ని సరికొత్త హంగులతో తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. స్టేడియం గ్యాలరీలకు ఆకర్షణీయమైన రంగులు వేయడంతో పాటు ఖేలో ఇండియా లోగోను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి స్టేడియానికి క్రీడా శోభ తీసుకురావాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జేఎన్ఎస్ స్టేడియంలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, సాంకేతిక బృందాలు ఈ పోటీలకు హాజరుకానున్నారు.వైద్య బృందాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచడంతో పాటు పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. జీడబ్ల్యూఎంసీ, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, క్రీడా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జాతీయస్థాయి క్రీడాకారులకు ఆకట్టుకునేలా జేఎన్ఎస్ స్టేడియాన్ని తీర్చిదిద్ది, ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ కార్యక్రమం లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలలో 100 శాతం మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

□ జిల్లా కలెక్టర్ కె. హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు 100 శాతం మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సర్వ శిక్ష ఎం ఐ ఎస్, సి ఆర్ పి, సి సి ఓ లకు ఏర్పాటు చేసిన యు డైస్ అవగాహన,శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు 100 చేత మౌలిక సదుపాయాల కల్పన దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, కనీస మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. యు డైస్ పోర్టల్ లో పాఠశాల భవనము, గదులు, విద్యార్థుల వివరాలు, ప్రవేశాల నమోదు, వయసు, తరగతి, ఆధార్, ఆపార్ వివరాలు, ఉపాధ్యాయుల వివరాలు, సర్వీసు, అర్హత, పోస్టింగ్ ప్రదేశాల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన అందించాలని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలు, సర్వ శిక్ష అభియాన్ లో భాగంగా వచ్చిన నిధులను కనీస వసతుల కల్పనకు ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లలో భారీ కోతలు.. కలెక్టర్ తనిఖీ చేయాలి

□ సిపిఐ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్

చిట్యాల, నవంబర్ 19(జనం సాక్షి): మండల కేంద్రంలోని శాంతినగర్ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహ రైస్ మిల్లు యాజమాన్యం ధాన్యం కొనుగోళ్లలో అక్రమ కోతలు విధిస్తూ రైతులను నిలువునా దోచుకుంటోందని సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ట్రాక్టర్ ధాన్యం కాంటా పెడితే ఏకంగా 50 నుంచి 60 కిలోల వరకు కోత విధిస్తుండటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా ఇదే మిల్లు యాజమాన్యం ఇదే తీరుగా వ్యవహరించిందని మండిపడ్డారు. ప్రభుత్వ మద్దతు ధరలు, నిబంధనలు పక్కాగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సదరు రైస్ మిల్లును క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అంజయ్య, సంఘీరాజు, గుర్రపు శంకర్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం లంచం అడుగుతుండ్రు

□ ఎమ్మెల్యేకు వృద్ధురాలు ఫిర్యాదు..

□ పోస్ట్ మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రేవూరి..

□ విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు



నడికూడ, నవంబర్ 19 (జనం సాక్షి) : నడికుడ మండలం కంటత్మకూర్ గ్రామంలో గురువారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పర్యటించారు పర్యటనలో భాగంగా అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు గాదె రాజమ్మ వృద్ధాప్య పెన్షన్ కోసం పోస్ట్ మెన్ లంచం అడిగాడని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ఫిర్యాదు చేయడం జరిగింది వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అతనిపై ఎంక్వయిరీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. . పరకాల నియోజకవర్గంలో ఎవరైనా ఏ అధికారైన లంచం అడిగినచో తీసుకున్నచో వారి తాటా తీస్తానని హెచ్చరించారు ఎవరినైనా ఉపేక్షించేది లేదు అని ఎవరైనా లంచం అడుగుతే తరిమి తరిమి కొట్టండి అని ఎమ్మెల్యే తెలియజేశారు.

రెండేళ్ల ప్రేమ పెళ్లికి నిరాకరణ

□ న్యాయం కోసం యువకుడు ఇంటి ముందు నిరాహార దీక్ష



దండేపల్లి, నవంబర్ 19 (జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామానికి చెందిన ఎల్లమద్రి అనిత (24), తండ్రి ప్రకాష్, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతి. దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన పాత్లే గౌతమ్ (27), తండ్రి మోహన్, లంబాడీ సామాజిక వర్గానికి చెందిన యువకుడితో గత రెండు సంవత్సరాలుగా పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం ప్రేమగా మారిందని ఇద్దరూ ప్రేమించుకున్న మని అయితే ప్రస్తుతం తనను వివాహం చేసుకోవడానికి గౌతమ్ నిరాకరిస్తున్నాడని అనిత ఆరోపిస్తోంది. రెండేళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు వివాహానికి నిరాకరించడంతో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలోని పాత్లే గౌతమ్ ఇంటి ముందు అనిత నిరాహార దీక్ష చేపట్టింది. కులాంతర ప్రేమ వ్యవహారంలో పెళ్లికి ఒప్పుకోవడం తాను ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతినని, యువకుడు లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని పేర్కొంటూ, కులాలతో సంబంధం లేకుండా తనకు న్యాయం జరగాలని అనిత కోరుతోంది.సంబంధిత అధికారులు, పోలీసు శాఖ స్పందించి సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది.తన సమస్యకు న్యాయబద్ధమైన పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగిస్తానని యువతి స్పష్టం చేస్తోంది. యువతి ఆవేదనను అధికారులు గుర్తించి, వెంటనే స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టేకు మొక్కల నరికివేతపై విజిలెన్స్ విచారణ..

□ జనంసాక్షి కథనంతో కదిలిన అటవీ శాఖ ఉన్నతాధికారులు..

□ భూపాలపల్లి అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించిన విజిలెన్స్ డీఎఫ్ఓ..

□ చోరీకి పాల్పడింది ఎవరు? సిబ్బంది పాత్రపైనా ఆరా..

□ బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక..

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 19 (జనంసాక్షి): అటవీ సంపదను కాపాడాల్సిన అటవీశాఖ కార్యాలయంలోనే టేకు మొక్కలు నరికివేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై జనంసాక్షి లో 'ఫారెస్ట్ కార్యాలయంలో టేకు చెట్లు నరికివేత' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా జనంసాక్షి కథనం అటవీశాఖ ఉన్నతాధికారులను కదిలించాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో టేకు చెట్లను నరికివేయడంపై గురువారం విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ డీఎఫ్ఓ శివయ్య భూపాలపల్లి అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కార్యాలయ ప్రాంగణంలో టేకు చెట్లను ఎవరు నరికివేశారు? ఈ వ్యవహారంలో అటవీశాఖ సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా? అనే కోణాల్లో వివరాలు సేకరించారు. విధుల నిర్వహణలో ఉండాల్సిన సిబ్బందే అటవీ సంపదకు నష్టం కలిగించినట్లు తేలితే సంబంధిత వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీఎఫ్ఓ స్పష్టం చేశారు. విచారణకు సంబంధించిన నివేదికను రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు అందజే యనున్నట్లు శివయ్య వెల్లడించారు. ఈ విచారణలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఎఫ్ఓ కృష్ణగౌడ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. అయితే అటవీశాఖ కార్యాలయంలోనే జరిగిన ఈ ఘటనకు బాధ్యులెవరో విచారణ నివేదికలో తేలాల్సి ఉంది.


ఫారెస్ట్ కార్యాలయంలో టేకు చెట్ల నరికివేత..

మల్లారంలో క్షేత్రస్థాయిలో భూముల రీ- సర్వే పరిశీలన

మల్హర్ నవంబర్ 19(జనం సాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం మల్లారం గ్రామంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో భూముల రీ-సర్వే ప్రక్రియను పరిశీలించి, రైతులతో మాట్లాడి భూములకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె రవి కుమార్, ఆర్ఐ నరేష్ కుమార్, జీపీఓ రాజు, లైసెన్స్‌డ్ సర్వేయర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 నవంబర్ 2026

చాంబర్ ఎన్నికల్లో కొత్త వివాదం..

- నామినేషన్లు ఆమోదించి అనర్హత వేటు ఎలా..?
- కోర్టును ఆశ్రయించవద్దంటూ అంగీకార పత్రంపై సంతకాలకు ఒత్తిడి
- నామినేషన్ల ఆమోదం తర్వాత కొత్త షరతులు విధించడంపై అభ్యంతరం
- సభ్యత్వ నమోదు నిధుల లెక్కలు వెల్లడించాలని డిమాండ్
- ఎన్నికల అధికారుల తీరుపై బచ్చు శ్రీనివాస్ ప్యానల్ ఆగ్రహం

భద్రాచలం, నవంబరు 19 (జనంసాక్షి) : శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల వివాదం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఈ నెల 29న జరగనున్న ఎన్నికల ప్రక్రియలో నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నామినేషన్లను పరిశీలించి ఆమోదించిన తర్వాత కొత్త షరతులు విధించి అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించడంపై బచ్చు శ్రీనివాస్ ప్యానల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల గుర్తు కేటాయించాలంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించబోమంటూ అంగీకార పత్రంపై సంతకం చేయాలని ఒత్తిడి తీసుకురావడం ఏమిటని ప్రశ్నించింది. భద్రాచలం పాత ఎల్ఐసీ రోడ్డులోని ఐస్ మ్యాజిక్ హాల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష అభ్యర్థి బచ్చు శ్రీనివాస్, ప్యానల్ సభ్యులు కల్కి వాసు శ్రీనివాస్, భరత్ ఎన్నికల అధికారుల తీరుపై తమ అభ్యంతరాలను వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్‌లో లేని నిబంధనలను మధ్యలో తీసుకొచ్చి తమ ప్యానల్‌ను పోటీకి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

– న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కును వదులుకోవాలా?

ఎన్నికల గుర్తుల కేటాయింపు కోసం పిలిచిన అధికారులు తమ ప్యానల్‌కు ఒకే గుర్తు కేటాయించాలంటే అంగీకార పత్రంపై సంతకాలు చేయాలని సూచించారని బచ్చు శ్రీనివాస్ తెలిపారు. ఆ పత్రంలో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగినా న్యాయస్థానాన్ని ఆశ్రయించకూడదనే షరతులు ఉండటాన్ని గుర్తించామని చెప్పారు. అభ్యంతరకరమైన రెండు అంశాలను తొలగిస్తే సంతకాలు చేసేందుకు సిద్ధమని చెప్పినా అధికారులు అంగీకరించలేదన్నారు. సంతకాలు చేయకపోతే పోటీకి అనర్హులుగా ప్రకటిస్తామని హెచ్చరించారని, చివరకు కొద్ది నిమిషాల్లోనే అనర్హత వేటు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆమోదించిన నామినేషన్లకు కొత్త షరతులా..?

ఈ నెల 14న తమ ప్యానల్ తరఫున ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, ఎన్నికల అధికారులు పరిశీలించి ఆమోదించారని వివరించారు. ఈ నెల 18న గుర్తుల కేటాయింపు సమయంలో కొత్త షరతులతో కూడిన అంగీకార పత్రాన్ని ముందుకు తెచ్చారని తెలిపారు. తాము కోరుకున్న బంతి గుర్తు కేటాయించాలంటే అంగీకార పత్రంపై సంతకాలు చేయాలని, లేకపోతే అనర్హులుగా ప్రకటిస్తామని చెప్పడం ఏ నిబంధనల ప్రకారమని ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలన్నీ నోటిఫికేషన్ సమయంలోనే వెల్లడించాల్సి ఉండగా, నామినేషన్లు ఆమోదించిన తర్వాత కొత్త షరతులు విధించడం సమంజసం కాదన్నారు.

సభ్యత్వ నమోదు నిధులకు లెక్కలేవీ..?

చాంబర్ సభ్యత్వ నమోదు వ్యవహారంలోనూ పారదర్శకత లేదని వారు ఆరోపించారు. ఆగస్టు 2న ఐదుగురు సభ్యులతో సభ్యత్వ నమోదు కమిటీని ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించి చాంబర్‌కు అప్పగించే బాధ్యత మాత్రమే అప్పగించారని తెలిపారు. మొత్తం 1,091 మంది సభ్యుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.500 చొప్పున రూ.5,45,500 వసూలు చేశారని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని చాంబర్ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని లిఖితపూర్వకంగా కోరినా స్పందన లేదని విమర్శించారు. సభ్యుల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయికి నిర్వాహకులు లెక్కలు చూపించాలని డిమాండ్ చేశారు.

వంద మందితోనే కీలక సమావేశం నిర్వహణ

సభ్యత్వ నమోదు కమిటీ తన పరిధిని దాటి నవంబరు 8న ఆర్యవైశ్య సత్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించిందని ఆరోపించారు. చాంబర్‌లో 1,091 మంది సభ్యులు ఉండగా, సమావేశానికి కేవలం 90 నుంచి 100 మంది మాత్రమే



హాజరయ్యారని తెలిపారు. కార్యదర్శి ఆధ్వర్యంలో జరగాల్సిన సమావేశాన్ని ప్రస్తుత కమిటీ రద్దయిందంటూ ఎలాంటి ఆధారాలు చూపకుండా నిర్వహించారని విమర్శించారు. సభ్యులందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే తాండ్ర రవణను ఎన్నికల అధికారిగా నియమించి నోటిఫికేషన్ విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

ఎన్నికలను అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు

ఎన్నికలను నిలిపివేయాలన్నది తమ ఉద్దేశం కాదని, నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలన్నదే తమ డిమాండ్ అని బచ్చు శ్రీనివాస్ స్పష్టం చేశారు. గుర్తుల కేటాయింపు సమయంలో తాము సాయంత్రం 5.05 గంటలకే హాజరై హాజరు పుస్తకంలో సంతకాలు చేసినప్పటికీ, రాత్రి 7.20 గంటలకు వచ్చి సంతకాలు చేయకుండా వెళ్లిపోయినట్లు నమోదు చేయడం అవాస్తవమని ఖండించారు. ఎన్నికల అధికారికి ప్రత్యేక అధికారాలు ఉన్నాయనే కారణంతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు.

న్యాయపోరాటం కొనసాగిస్తాం

సభ్యత్వాలపై పూర్తిస్థాయి పరిశీలన చేపట్టాలని, వసూలు చేసిన నగదును చాంబర్ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, ఎన్నికల నిర్వహణకు తటస్థ అధికారిని నియమించాలని కోరుతూ ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వెల్లడించారు. తమ ప్యానల్‌ను అనర్హులుగా ప్రకటించిన నిర్ణయాన్ని కూడా న్యాయపరంగా సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. సుమారు రెండు వేల మంది వ్యాపారుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న సంస్థలో కొందరి నిర్ణయాలే తుది నిర్ణయాలు కాకూడదని, ప్రతి సభ్యుడి హక్కులకు గౌరవం కల్పించాలని కోరారు. ఎన్నికలు నియమావళికి అనుగుణంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బచ్చు శ్రీనివాస్, కల్కి వాసు శ్రీనివాస్, భరత్ పేర్కొన్నారు.

చీకటిమామిడిలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన

- ప్రత్యామ్నాయ పంటల పరిశీలన



బొమ్మలరామారం, నవంబర్ 19 (జనం సాక్షి) : మండలంలో చీకటిమామిడి గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు కోసం ఏర్పాటు చేసిన వసతి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం రైతులు సాగు చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల పంటలు, గ్రీన్ హౌస్ ఫార్మింగ్, వెజిటబుల్ ఫార్మింగ్ వి బి జి రాంజీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను సందర్శించి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి హేమలత, స్థానిక తహశీల్దార్ రాధా , మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్యామల , మండల పంచాయతీ అధికారి శశికళ , సర్పంచ్ తిరుమణి నాగరాజు గౌడ్, మండల వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి, హెచ్ ఓ కె. కవిత, ఉప సర్పంచ్ జూపల్లి భూమయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ , ఈ సి పుష్పలత , టెక్నికల్ అసిస్టెంట్ ఉమా, మంజుల పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మార్గమధ్యలో నిలిచిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు

- రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు..
- తీవ్ర ఇబ్బందులు



దేవరకొండ, నవంబర్ 19 (జనం సాక్షి) : దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ ఈ డీలక్స్ టీజీ 29 టీ 3806 ఎలక్ట్రిక్ బస్సులో టికెట్లు తీసుకుని హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గురువారం మార్గమధ్యలో చేదు అనుభవం ఎదురైంది. బస్సు ఇబ్రహీంపట్నం దాటిన అనంతరం నడిరోడ్డుపైనే బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు చాలాసేపు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం మరో బస్సు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు దానిలో హైదరాబాద్‌కు బయలుదేరారు. అయితే ఎలక్ట్రిక్ బస్సుల్లో ఛార్జింగ్ ఎప్పుడు అయిపోతుందో, ఎంత దూరం ప్రయాణించగలవో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణానికి ముందే బస్సును పరిశీలించకుండా ఎలా నడుపుతున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కబడ్డీ కోచ్ పోస్టుకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

- కాచనపల్లి బాలికల మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో తాత్కాలిక నియామకం
- ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు



భద్రాచలం, నవంబరు 19 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ భద్రాచలం పరిధిలోని కాచనపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో కబడ్డీ కోచ్ పోస్టును తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. ఈ నియామకానికి ఎన్ఐఎస్, ఎన్ఐఎస్ డిప్లొమా లేదా ఒక సంవత్సరం వ్యవధి గల పీజీ డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు (రెజ్యూమ్), సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాల ప్రతులను జతచేసి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పీఎంఆర్సీ స్పోర్ట్స్ ఆఫీసర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని సూచించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. నియామకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 9848988205, 9912362053 నంబర్లను సంప్రదించాలని ఐటీడీఏ పీవో కోరారు.

అశ్వాపురం ఆలయాల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.7.54 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



అశ్వాపురం, నవంబర్ 19 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓం శక్తి ఆలయం, సాయిబాబా ఆలయాల్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రాచలం డిఎస్పి, ఇన్‌చార్జ్ మణుగూరు డిఎస్పి అరుణ్ కుమార్ తెలిపారు.ఈ నెల 12, 13 తేదీల మధ్య అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగలగొట్టి అమ్మవారి మెడలోని మూడు బంగారు పుస్తెల తాళ్లను (105 గ్రాములు), వెండి కిరీటాలు, చేతులు, పాదాలు, శరగోపం తదితర వెండి వస్తువులను దొంగిలించారు. మొత్తం 7 కిలోల 900 గ్రాముల వెండి వస్తువులతో పాటు బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.7,54,000 ఉంటుందని ఆలయ సూపర్‌వైజర్ రామకృష్ణన్ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, డిఎస్పి పర్యవేక్షణలో సిసిఎస్ బృందం, అశ్వాపురం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం గొల్లగూడెం శివారులోని సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు అశ్వాపురంలోని ఓం శక్తి, సాయిబాబా ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితులు షేక్ జానీ ఏ జానీ షరీఫ్ – నవభారత్, పాల్వంచ (స్వస్థలం: రెడ్డిపాలెం, బూర్గంపహాడ్ మండలం); సప్కా కాంతారావు – కమ్మరిగూడెం గ్రామం, వేలేరుపాడు మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్; ఊర లింగయ్య – కొత్తపేట గ్రామం, కేతపల్లి మండలం, నల్గొండ జిల్లా. విచారణలో భాగంగా నిందితుల గత నేర చరిత్రను పరిశీలించగా, షేక్ జానీపై 11, సప్కా కాంతారావుపై 14, ఊర లింగయ్యపై 8 చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డిఎస్పి అరుణ్ కుమార్ తెలిపారు.ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును రికవరీ చేసిన అశ్వాపురం పోలీస్ సిబ్బంది, సిసిఎస్ బృందాన్ని డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

చిట్యాల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



చిట్యాల, నవంబర్ 19 (జనం సాక్షి) : చిట్యాల సమీపంలోని ఐడియల్ కంపెనీ వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ప్రయాణికుడు మృతి చెందగా, ఇంకొకరు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సుమారు 7.15 గంటల సమయంలో రామన్నపేట నుంచి ఇద్దరు ప్రయాణికులతో చిట్యాల వైపు వస్తున్న ప్యాసింజర్ ఆటో (ఏపీ 24 డబల్యు 8731) ఐడియల్ కంపెనీ సమీపంలోని మూలమలుపు వద్దకు చేరుకుంది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కారు (ఏపీ 28 డీఎస్ 4135) డ్రైవర్ అతివేగంగా ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో ముందు భాగాన్ని ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పిన ఆటోను ఎదురుగా చిట్యాల నుంచి భువనగిరి వైపు వస్తున్న లారీ (టి ఎన్52 ఏ ఏ 8515) బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఏనుగు శ్రీశైలం తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న గుండెబోయిన మహేష్, మోటే గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. గుండెబోయిన మహేష్‌ను 108 అంబులెన్స్‌లో నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మోటే గణేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు ఏనుగు శ్రీశైలం తండ్రి ఏనుగు నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు చిట్యాల ఎస్ఐ బి. వెంకటరెడ్డి వివరాలు వెల్లడించారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా

- అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలి
- ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ సునీల్ దత్



ఖమ్మం టౌన్, నవంబర్ 19 (జనంసాక్షి) : ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గంజాయి వినియోగించే వారితో పాటు విక్రయించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని మరింత ముమ్మరం చేయడంతోపాటు నిర్మానుష్య ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు నిర్దిష్ట సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యలను గుర్తించి, వాటిని పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీస్ అధికారులకు సూచించారు.

నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బి ఇరిగేషన్ కార్యాలయాల పనుల పరిశీలన

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్ టౌన్, నవంబర్ 19 (జనంసాక్షి) : పట్టణంలో గురువారం రూ.8 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, డివిజన్ కార్యాలయం, కాంప్లెక్స్ నిర్మాణ పనులను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. అనంతరం పక్కనే మరో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం, కాంప్లెక్స్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని, నిర్దిష్ట గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపుల ప్రారంభం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 19 (జనం సాక్షి) : ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపులు నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో దశలవారీగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, నెల రోజుల లోగా అన్ని గ్రామాలు, వార్డుల్లో క్యాంపుల నిర్వహణ పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో, మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో శుక్రవారం నుంచి పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా క్యాంపులు నిర్వహించి కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలు తమ రేషన్ కార్డును తీసుకుని సమీపంలోని క్యాంపునకు రావాలని సూచించారు. రేషన్ కార్డు నంబర్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుని, కుటుంబంలో ఎవరి పేరు మీద బీమా చేయాలి, నామినీలు ఎంతమంది, వారికి చెల్లించాల్సిన భీమా వివరాలను శాతాల వారిగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

ప్రజలకు ఇప్పటికే రైతు బీమా, చేనేత బీమా, బీడీ కార్మికుల బీమా, భవన నిర్మాణ రంగ కార్మికుల బీమా మొదలగు ఇతర ప్రభుత్వ బీమా పథకాలు అమలులో ఉన్నప్పటికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించే ముందు నమోదు చేసిన వివరాలన్నింటినీ లబ్ధిదారులకు మరోసారి పూర్తిగా చదివి వినిపిస్తామని, వారి అంగీకారం తీసుకున్న తర్వాతే దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో అందించిన మొబైల్ నంబర్‌కు దరఖాస్తు ఐడీ, సంబంధిత సమాచారం ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని పేర్కొన్నారు. క్యాంపుల్లో భౌతికంగా దరఖాస్తులు సమర్పించడం, రసీదులు జారీ చేయడం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్యాంపు కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో రేషన్ కార్డు వివరాలు, ట్రాన్సాక్షన్ ఐడీ, బీమా పొందే వ్యక్తి పేరు, నామినీ పేరు నమోదు చేసి సంబంధిత దరఖాస్తుదారుడి సంతకం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రస్తుతం రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాలను ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం కల్పించలేదని కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాల నమోదుకు ఆన్‌లైన్‌లో అవకాశం అందుబాటులోకి వచ్చిన వెంటనే వారి దరఖాస్తులను కూడా స్వీకరించి, అట్టి దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ రేషన్ కార్డులతో సమీపంలోని క్యాంపులకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20.11.2026



న్యాయవాదులకోసం ఫ్రూట్ బౌల్స్ ప్రారంభం

కరీంనగర్ లీగల్ (జనంసాక్షి):కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలోని కరీంనగర్ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ స్టోర్‌లో న్యాయవాదుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహారంతో కూడిన ఫ్రూట్ బౌల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సొసైటీ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, కోశాధికారి సుంకె దేవకిషన్ ఆధ్వర్యంలో గురువారం ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ, నిత్యం కోర్టు విధులు, కేసుల విచారణలతో తీరిక లేకుండా గడిపే న్యాయవాదులకు ఆరోగ్యకరమైన అల్పాహారం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఫ్రూట్ బౌల్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.భవిష్యత్తులో న్యాయవాదుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సొసైటీ స్టోర్‌లో ఫ్రూట్ బౌల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గంట సతీష్, ముద్దమల్ల అశోక్, ముద్దసాని సంపత్, దాడి ఓంకార్, బండపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



రామడుగు(జనంసాక్షి): దేశ మొదటి మహిళా ప్రధాని, భారత రత్న, ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలు గుండి గ్రామంలో గుండి గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం ఆధ్వర్యంలో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జవ్వాజి హరీశ్ (తాజా మాజీ ఎంపీపీ) ముఖ్య అతిథిగా హాజరై ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ఇందిరా గాంధీ అనంతరం తాసిల్దార్ దాసరి రాజ మల్లయ్య చేతుల మీదుగా ముంజల రజిత, వైఫ్ ఆఫ్ ప్రవీణ్ ఇందిరమ్మ కుటుంబం పథకం మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి, దేశ ఐక్యత, సమగ్రతకు ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సర్పంచులు ఎడవెల్లి వనజ నరేందర్ రెడ్డి, రాజేష్ ఖన్నా, అనంతరెడ్డి, మొయిజ్, ఆర్ఐ కమలేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, మాజీ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మర వేణి తిరుపతి, శ్యామ్, మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, శంకర్,కత్తి మధు, మడ్డి ఆంజనేయులు, సిరాజ్, బాపురాజు, రాజు,వేణు, తిరుపతి, మల్లేశం మధు, శేఖర్, సంజయ్, సాయి, రాయలింగు, పోచయ్య, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, గ్రామ మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



రామడుగు(జనంసాక్షి):రామడుగు మండలంలోని వెదిరా గ్రామంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం నందు సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ కరీంనగర్ మహిళా సాధికారత కేంద్రం, పోలీస్ డిపార్ట్మెంట్ కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థినులకు బాల్య వివాహ రహిత భారత్ అవగాహన సదస్సులో భాగంగా నశాముక్తభారత్ అభియాన్ మత్తు పదార్థాలు వాడకం దానివల్ల జరిగే నష్టాల గురించి బాల్య వివాహాల గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మిరుపూరు వెంకటేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు అమ్మాయి 21 సంవత్సరాల లోపు అబ్బాయి పెళ్లి చేసుకోవడం నేరం ఒకవేళ ఎవరైనా చేసుకున్నట్లయితే 2 సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా విధించబడును దీనికి సహకరించిన వారికి పాల్గొన్న వారికి జరిపించిన వారు శిక్ష అర్హులు అరి అని తెలిపారు. ఎవరైనా ఇటువంటి పెళ్లి చేస్తున్నారని తెలిస్తే 1098 కాల్ చేయగలరు మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని చెప్పారు. అలాగే మహిళా సాధికారత కేంద్రం నుంచి జెండర్ స్పెషలిస్ట్ శ్రీమతి శైలజ మాట్లాడుతూ పిల్లలకు,మహిళలకు ఎటువంటి సమస్యలు వచ్చినా 1098 & 181 సంప్రదించగలరని సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ కవిత, కేజీబీవీ టీచర్లు విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ టాయిలెట్స్ డే

రామడుగు(జనంసాక్షి):మండలంలోని వెలిచాల గ్రామంలో వరల్డ్ టాయిలెట్స్ డే ను ఘనంగా నిర్వహించారు. వెలిచాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు గ్రామంలోని ఇండ్ల టాయిలెట్లను పూలతో అలంకరించి టాయిలెట్స్ డే కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగరావు మాట్లాడుతూ ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో, అదే విధంగా టాయిలెట్లను కూడా శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి. పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉక్కుమనిషి ఇందిరాగాంధీ

- కరీంనగర్‌లో ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు
- ఇందిరమ్మ జీవిత బీమా బ్రోచర్ విడుదల చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కరీంనగర్ బ్యూరో , నవంబర్ 19 (జనంసాక్షి)
:ప్రపంచం ఉక్కు మహిళగా కీర్తించిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ లోని ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే , కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ తో పాటు పలువురు నాయకులు హాజరై, ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఇందిరా గాంధీ జీవిత బీమా పథకం కర పత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... భారతదేశ స్వాతంత్ర్యా నంతరం ఈ దేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానిగా 4 సార్లు ప్రధానమంత్రిగా విశేష సేవలందించారు. జవహర్ లాల్ నెహ్రూకి పొలిటికల్ సెక్రటరీగా, లాల్ బహదూర్ శాస్త్రి క్యాబినెట్‌లో ఐ అండ్ పి ఆర్ మినిస్టర్ గా సేవలు చేసి, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానమంత్రి పదవి చేపట్టి, దేశ సంక్షేమం, అభివృద్ధి కోసం, ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం కూడు, గూడు, గుడ్డ అందించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆ రోజు ఇందిరా గాంధీ చొరవ వల్లే నేడు దళితులు, బడుగు, బలహీన వర్గాలు ఆత్మగౌరవంతో ఉన్నారని, 'గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు, 20 సూత్రాల పథ కంతో దేశ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు.ఇందిరా గాంధీ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక్‌త్వంలో తెలంగాణలో సంక్షేమ పథకాలు అందిస్తు న్నామని తెలిపారు. జయంతి సందర్భంగా వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, టాడీ టాపర్స్ దాదాపు 5 లక్షల మందికి వారి పేరుపైన చేయూత పెన్షన్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. భారతదేశంలో ఏ ప్రభుత్వం, ఏ రాష్ట్రం చేయని విధంగా ఇందిరా గాంధీ జీవిత బీమా పేరు పైన రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి 18 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు ఉన్న, లేకున్నా, ఈ రాష్ట్రంలో పుడితే చాలు, ఆ కుటుంబ పెద్దకు సహజ మరణం సంభవించిన, ప్రమాదవశాత్తు మరణించిన బీమా అమలు చేస్తున్నామని, దానికి సంబంధించిన బ్రోచర్ ను ఇందిరా గాంధీ విగ్రహం సాక్షిగా ఆవిష్కరించడం జరిగిందని అన్నారు.ఇలాంటి పథకం ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో, ఏ ప్రభుత్వం, ఏ పార్టీ చేయలేదని, ఇందిరా గాంధీ స్ఫూర్తితో భారతదేశంలోని 29 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తున్నామని అన్నారు. నాయకులు , ఏం డి తాజ్, మడుపు మోహన్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, గడ్డం విలాస్ రెడ్డి, పత్తి మధుకర్ రెడ్డి, వెన్న రాజ మల్లయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సిరిపురం లావణ్య, పడాల అజయ్, వరాల నర్సింగం, వెన్నం రజిత రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రహమాన్, దన్నా సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మంథని ఫోటోగ్రాఫర్‌కు అంతర్జాతీయ గుర్తింపు



మంథని(జనంసాక్షి): మంథని పట్టణానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రా ఫర్, రవి వర్మ ఫోటో స్టూడియో యజమాని తూర్పాటి సత్యనారాయణకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. ఫ్రాన్స్, ఇటలీ, మొనాకో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక రామోగే ఫోటో కాంటెస్ట్ 2026 – ది మ్యాన్ అండ్ ది సీ పోటీలో ఆయన తీసిన బోండా మహిళ తాగుతోంది అనే ఫోటోకు ప్రత్యేక ప్రస్తావన లభించింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి వేలాది మంది ఫోటోగ్రాఫర్లు పంపిన ఫోటోలలో సత్యనారాయణ ఫోటో అంతర్జాతీయ జ్యూరీని ఆకట్టుకుంది. సముద్రంతో మనిషికి ఉన్న అనుబంధాన్ని, గిరిజన మహిళ జీవన విధానాన్ని ఆయన తన కెమెరాలో అద్భుతంగా బంధించారని నిర్వాహకులు ప్రశంసించారు. ఈ అవార్డు ప్రధానోత్సవం డిసెంబర్ 4, 2026న మొనాకోలోని ప్రపంచ ప్రసిద్ధ ఓషనోగ్రాఫిక్ మ్యూజియంలో జరగనుంది. ఈ వేడుకలో అంతర్జాతీయ జ్యూరీ సభ్యులు పాల్గొని విజేతలను సత్కరించనున్నారు. అనంతరం కాక్టెయిల్ పార్టీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తూర్పాటి సత్యనారాయణ మాట్లాడుతూ.. మంథని లాంటి చిన్న పట్టణం నుంచి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది తెలంగాణ ఫోటోగ్రాఫర్లందరికీ గర్వకారణమని అన్నారు. మంథని పట్టణ ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు సత్యనారాయణకు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా కొండగట్టు అంజనేయస్వామి చందనోత్సవాలు

- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ
- సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులకు సూచన

మల్యాల నవంబర్ 19 (జనంసాక్షి):కొండగట్టు ఆంజనేయ స్వామివారి నిజరూప దర్శన మహోత్సవ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కొండగట్టుకు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ పరిసరాలను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ తెలిపారు.తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టులోని ఆంజనేయస్వామి దేవస్థాన ములో సుమారు 60 సంవత్సరాల అనంతరం నవంబర్ 15 నుండి 20 వరకు నిర్వహిస్తున్న చందనోత్సాదనం మహాసంప్రోక్షణ అనంతరం నవంబర్ 21 నుండి డిసెంబర్ 29వ తేదీ(40 రోజులు) శ్రీ స్వామివారి నిజరూప దర్శన మహోత్సవ కార్యక్రమంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్,భక్తుల రాకపోకలు,క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఆలయ పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని,రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు,వృద్ధులు, చిన్నపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని భక్తులు సురక్షితంగా తిరిగి వెళ్లేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రధాన రహదారులు, ఆలయానికి వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని తెలిపారు.



సమన్వయంతో విధులు నిర్వహించాలి
బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట ఆలయ ఈవో అంజన రెడ్డి,డిఎస్పి పురుషోత్తం రెడ్డి,మల్యాల సిఐ రాజ్ కుమార్, ఎస్.ఐ లు సందీప్,నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో శరీరక దారుఢ్యం

- వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి
- తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యం. యాదగిరి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 జనంసాక్షి:తెలంగాణ యూనివర్సిటీ లో కబడ్డీ విమెన్ టోర్నీ కం సెలెక్షన్స్ ను నిర్వహించామని వర్సిటీ స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డా. బి. ఆర్. నేత తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. యాదగిరి , అతిథిగా డైరెక్టర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డా. జి. బాలకిషన్ హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో నిజామాబాద్, కామరెడ్డి జిల్లాల నుండి 10 కళాశాలల జట్లు పాల్గొనగా విన్నర్ గా నిలిచిన జి. జి కాలేజ్ మరియు రన్నర్ గా నిలిచిన టి జి ఆర్ ఎస్ కామారెడ్డి జట్లకు ట్రోఫీ మోడల్స్ మరియు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. యాదగిరి మాట్లాడుతూ క్రీడలు రెగ్యులర్ గా ప్రాక్టీస్ చేయడం ద్వారా శారీరక ధృడ్యనీ మరియు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని తెలిపారు. సెలెక్షన్ క్రీడా కారులు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ విమెన్ టోర్నమెంట్ 7-11 డిసెంబర్ 2026 వరకు కృష్ణ యూనివర్సిటీ ఎ.పి. లో తెలంగాణ యూనివర్సిటీ టీం గా పాల్గొంటూరని, అందులో మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ కి మంచి పేరు, ఖ్యాతి ని తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్ ప్రో. బాలమణి, డా. రమాదేవి, రూప, పూజ, సౌజన్య ఆర్గనైజింగ్ సెక్రెటరీ డా. బి. ఆర్. నేత జూనియర్ అసిస్టెంట్ జాదవ్ నరేష్ మరియు క్రీడాకారుల పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్వయం పరిపాలన

వేములవాడ(జనంసాక్షి): వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాల నిర్వహణ బాధ్యతలతో పాటు తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారి ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదన్నారుఉపాధ్యాయులు రవీందర్, కోటేశ్వర్, సలాం, బాలకృష్ణ, హమీద్, జ్యోతి, శిరోమణి, రమాదేవి, ఉమారాణి, భూదేవి తదితరులు పాల్గొన్నారు.



పత్తి సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

రైతులకు శాస్త్రవేత్తల సూచన



భిక్కనూరు నవంబర్ 19 (జనంసాక్షి):
రైతులు పత్తిసాగులో అధిక దిగుబడులు సాధించడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గించి, పంటనాణ్యత ను పెంపొందించాలనే లక్ష్యంతో గురువారం భిక్కనూరు గ్రామంలో పత్తిపంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో కేంద్రీయ సస్యరక్షణ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు ఉదయ శంకర్, హేనప్పగౌడ్ పాల్గొని రైతులకు పత్తి సాగులో పాటించాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, పంట ఎదుగుదలకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించడం,చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.అవసరానికి మించి రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేలసారవంతం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు పెరిగి పర్యావరణానికి కూడా నష్టం కలిగేప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు సూచించారు.ఆధునిక సాగు పద్ధతులను అవలంబిం చాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కోరారు.జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మహిత, ఏడీఏ అంజర్ణ, మండల వ్యవసాయ అధికారి నాగరాజ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజేష్,దీక్షిత్ రెడ్డి,లత, ప్రియాంకతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఆలయ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- తెలంగాణ తిరుపతి దేవస్థానాన్ని
- సందర్శించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 19(జనంసాక్షి):
కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రసిద్ధ తెలంగాణ తిరుపతి దేవస్థానాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయ ప్రాంగణాన్ని, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య, అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజల సమయంలో రద్దీ, లడ్డూ తయారీ, ప్రసాదాల పంపిణీ తదితర వివరాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. పండుగలు, ప్రత్యేక పూజల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు.



మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



సిరిసిల్ల టౌన్, (జనంసాక్షి):మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీనివాస్ వాహనదారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ చౌరస్తా వద్ద సిరిసిల్ల నుంచి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై గురువారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో వాహనదారులకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి

- కేసుల దర్యాప్తును సత్వరంగా పూర్తి చేయాలి
- నిజామాబాద్ 1 టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన బాసర జోన్-2 డీఐజీ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 జనంసాక్షి:నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌ను బాసర జోన్-2 డీఐజీ కె. నారాయణ్ నాయక్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య డీఐజీ కి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.అనంతరం డీఐజీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ , రికార్డుల నిర్వహణ , కేసుల దర్యాప్తు పురోగతి , సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధులు , బాధ్యతలు , ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీఐజీ కె. నారాయణ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ట , గౌరవం మరింత పెరిగే విధంగా అంకితభావంతో విధులు నిర్వహించాలి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరాలను త్వరితగతిన ఛేదించాలి.కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సమన్లు,వారెంట్ల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.కేసుల దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేసి , న్యాయస్థానాల్లో త్వరితగతిన చార్జిషీట్లు దాఖలు చేయాలి.ప్రతి పోలీస్ సిబ్బంది చట్టాలు , నూతన నేర న్యాయ చట్టాలు , పోలీస్ విధివిధానాలు, సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా , క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని డీఐజీ సిబ్బందికి సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ ద్వారా పోలీస్ స్టేషన్ పనితీరు , సిబ్బంది విధుల నిర్వహణ , కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసీపి శ్రీ ప్రకాష్,ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్,ఎస్సై బాల్ సింగ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 నవంబర్ 2026



మారనున్న విద్యా విధానంలో

ఆర్ట్స్‌కు ప్రాధాన్యమెంత?

ఆర్ట్స్ గ్రూపులుంటేనే అనుమతులు ఇవ్వాలి

- అన్ని గ్రూపుల నిర్వహణ తప్పనిసరి చేయాలి

కోదాడ, నవంబర్ 19 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతోంది. ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో నూతన విద్యా విధానం అమలుకు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో 10+2 నూతన విద్యా విధానం ఎలా ఉండబోతుందన్న ఆసక్తి నెలకొంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా అన్ని సబ్జెక్టులపై సమగ్ర అవగాహన పెంపొందించుకునేలా పాఠ్యాంశాలు రూపొందించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

సామాజిక శాస్త్రాలతోనే సమగ్ర అభివృద్ధి

విద్య అంటే కేవలం సాంకేతిక, వైద్య రంగాలకే పరిమితం కాదు. సామాజిక శాస్త్రాల ద్వారా కూడా విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. పౌరసేవలు, న్యాయవిద్య, పాత్రికేయం, వ్యాపార, ఆర్థిక రంగాల్లో రాణించేందుకు ఆర్ట్స్ గ్రూపులు బలమైన పునాదిగా నిలుస్తాయి.

అన్ని గ్రూపులుంటేనే అనుమతులు ఇవ్వాలి

ఇంటర్మీడియట్ కళాశాలలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో బోర్డు అన్ని గ్రూపుల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నప్పటికీ, యాజమాన్యాలు లాభార్జనే ధ్యేయంగా ఎంపీసీ, బైపీసీ కోర్సులకే పరిమితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నూతన 10+2 విద్యా విధానంలో సీనియర్ సెకండరీ స్థాయి అనుమతులు ఇచ్చేటప్పుడు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సైన్స్‌తో పాటు ఆర్ట్స్, కామర్స్ గ్రూపులను కూడా తప్పనిసరిగా నిర్వహించేలా ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

న్యాయవిద్యపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన :

ఎస్. అజయ్ కుమార్, న్యాయ విద్యార్థి, మునగాల



నూతన విద్యా విధానంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించేలా న్యాయవిద్యకు సంబంధించిన పాఠ్యాంశాలను ప్రవేశ పెట్టాలి. దీనివల్ల విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెరిగి, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలి.

వాణిజ్య రంగంపై అవగాహన కల్పించాలి :

ఎం. సత్యనారాయణ, కామర్స్ అధ్యాపకులు, కోదాడ



వర్తక, వాణిజ్య రంగాలతో పాటు బ్యాంకింగ్ రంగం కూడా నిరంతరం అభివృద్ధి చెందుతోంది. పాఠశాల స్థాయి నుంచే ఈ రంగాలకు సంబంధించిన వ్యవస్థలు, విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వ్యాపార, బ్యాంకింగ్ రంగాల్లో రాణించేందుకు మంచి అవకాశాలు ఉంటాయి.

మామూళ్లు వసూళ్లు చేసిన అబ్కారీ శాఖ అధికారులు

- అబ్కారీ శాఖ అక్రమ వసూళ్లపై ఉన్నత స్థాయి అధికారులకు పిర్యాదు
- తీసుకున్న నగదును తిరిగి ఇచ్చేసిన అబ్కారీ శాఖ అధికారులు
- ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో అవినీతి తాండవం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో నిరుపేద కల్లుగీత కార్మికులపై ఎక్సైజ్ అధికారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది గ్రామాలలో కొనసాగే చిన్నపాటి కల్లు దుకాణాలపై తనిఖీల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని ఎర్రవెల్లి గ్రామంలో లచ్చయ్య గౌడ్ అనే వ్యక్తి వద్ద తనిఖీలకు వెళ్లిన సీఐ శ్రీనివాస్ రెడ్డి ఎస్సై శ్రీనివాస్ సిబ్బంది అశోక్, కొండలరావు, తనిఖీల పేరుతో వెళ్లి ఎర్రవెల్లి గ్రామంలో లచ్చయ్య గౌడ్ అనే వ్యక్తి నుండి 20వేల రూపాయలు డిమాండ్ చేసి 15000 రూపాయలకు సెటిల్మెంట్ చేసుకొని 15 వేల రూపాయలు తీసుకొని వెళ్లారు ఇలా మండలంలోని బొబ్బిలిగామ, సీతారాంపూర్, దోసాడా, ముక్తగూడెం తాళ్లపల్లి గ్రామాల్లో అక్రమాలకు పాల్పడ్డారని బూతు మాటలు తిట్టి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఎర్రవల్లి గ్రామానికి





చెందిన బాధితుడు లచ్చయ్య గౌడ్ డైరెక్టర్ ఎక్సైజ్ శాఖ తెలంగాణతో పాటు ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్ కు ఫిర్యాదు చేశారు దీంతో వసూళ్లకు పాల్పడ్డ సిబ్బంది తిరిగి లచ్చయ్య గౌడ్ దగ్గరికి వచ్చి తీసుకున్న నగదు డబ్బులను తిరిగి ఇచ్చేసి వెళ్లిన ఉదంతం వెలుగులోకి వచ్చింది దీంతో ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరెడ్డి బాధితులను గురువారంనాడు విచారించారు ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన సిఐ శ్రీనివాస్ రెడ్డి ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది అశోక్, కొండలరావు, తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేవెళ్ల సర్వే నంబర్ 75లో ఇందిరమ్మ ఇళ్ల టవర్లు నిర్మించాలి

- గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి డిమాండ్

చేవెళ్ల, నవంబర్ 19 (జనంసాక్షి) : చేవెళ్ల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 75లో గత నాలుగు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటూ ఇంటి పట్టాల కోసం భూపోరాటం చేస్తున్న పేదల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కే. రామస్వామి డిమాండ్ చేశారు. గుడిసెవాసుల ఆధ్వర్యంలో రోడ్లు భవనాల శాఖ గెస్ట్‌హౌస్ సమీపంలో మండల పార్టీ కార్యదర్శి మల్లారి సత్తిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామస్వామి మాట్లాడుతూ.. సర్వే నంబర్ 75లో పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల టవర్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా పేదలు నివాస స్థలాల కోసం పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారికి నివాస హక్కు కల్పించాల్సిన ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని విమర్శించారు. సర్వే నంబర్ 75లో నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు న్యాయం చేయాలని, గుడిసెవాసులకు మంచినీరు, విద్యుత్, మొబైల్ టాయిలెట్లు వంటి కనీస మౌలిక సదుపాయాలను ప్రభుత్వం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని, పేదల



గుడిసెలను తొలగించే ప్రయత్నాలు చేయకుండా వారికి శాశ్వత నివాస హక్కు కల్పించాలని కోరారు. భూమిలేని పేదలకు భూమి, ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కల్పించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని రామస్వామి స్పష్టం చేశారు. పేదల హక్కుల సాధన కోసం భూపోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బూల్, రైతు సంఘం నాయకులు బి.సుభాన్ రెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు, సీనియర్ నాయకులు డాక్టర్ షౌరీలు, బీఓసీ మండల అధ్యక్షుడు శ్రీను, రవి, శ్రీను, పాపయ్య, పోచయ్య, పెంటయ్య, యాదయ్య, లలిత, మాధవి, అంజమ్మ, సావిత్రి, సుగుణమ్మ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై బావిలో దూకి యువకుడు ఆత్మహత్య

మృతుని తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

మర్పల్లి నవంబర్ 19 (జనంసాక్షి): మద్యానికి బానిసై ఓ యువకుడు వ్యక్తి జీవితంపై విరక్తితో బావిలో దూకి మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రంలోచోటుచేసుకుంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి గ్రామానికి చెందిన పులుమద్ది శ్రీకాంత్ (32) కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఆయనకు వివాహం కాలేదు. ఇటీవల మద్యానికి బానిసైన శ్రీకాంత్ మద్యం మత్తులో తరచూ చనిపోతానంటూ కుటుంబ సభ్యుల వద్ద ప్రవర్తించేవాడని తల్లి నర్సమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం ఉదయం 5 గంటలకు మద్యం మత్తులో ఇంట్లో అరుస్తూ బయటకు వెళ్లిన శ్రీకాంత్ కొద్దిసేపటికి కనిపించకుండా పోయాడు. దీంతో అనుమానం వచ్చిన తల్లి ఇంటి సమీపంలోని పాడుబడిన బావిలో పరిశీలించగా, బావిలోని చెత్తపై శ్రీకాంత్ కనిపించాడు. వెంటనే బంధువులు, స్థానికులను పిలిచి రక్షించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బావిలోకి దిగిన బంధువులు శ్రీకాంత్‌ను కాపాడేందుకు ప్రయత్నించగా, ఆయన లోతైన నీటిలోకి వెళ్లి చిక్కుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు గజ ఈతగాళ్లు, రెస్క్యూ బృందం సహాయంతో బావిలో గాలింపు చేపట్టి శ్రీకాంత్ మృతదేహాన్ని బయటకు తీశారు. తన కుమారుడి మృతిపై ఎవరి మీదా అనుమానం లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లి నర్సమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఆపద్బాంధవుడిగా నిలిచిన పట్నం మహేందర్ రెడ్డి

మల్కాజిగిరి నవంబర్ 19 (జనం సాక్షి) : అతివేగంగా, అజాగ్రత్త గా వచ్చిన ఓ వాహనం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం మల్కాజిగిరి పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు, స్థాని కుల కథనం ప్రకారం. మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీకి చెందిన తాటికాయల సురేశ్ (28) స్థానికంగా ఉన్న ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. చికెన్ డెలివరీ నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై మల్కాజిగిరిలోని ఈస్ట్ ఆనంద్‌బాగ్ వైపు వెళ్తున్నాడు. జెడ్‌టీఎస్ దాటిన తర్వాత ఆర్‌పీఎస్ఎఫ్ క్యాంటీన్ సమీపంలోకి రాగానే.. ఐషర్ డీసీఎం వాహనం TS08 UE 7680 డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వాహనాన్ని ఒక్కసారిగా కుడివైపునకు తిప్పాడు. దీంతో ముందు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు



సడన్ బ్రేక్ వేశాడు.వెనుకనే వస్తున్న సురేశ్ కూడా తన వాహనాన్ని ఒక్కసారిగా ఆపే ప్రయత్నంలో అదుపుతప్పి కిందపడి పోయాడు.ఈ క్రమంలో ఐషర్ వాహన టైరు సురేశ్ ఎడమ కాలి పైనుంచి వెళ్లడంతో ఎడమ మోకాలు, పిక్క భాగాలతో పాటు ఎడమ చేతికి తీవ్ర గాయాల పాలై రోడ్డు పక్కన పడి పడి ఉన్నాడు.మల్కాజిగిరిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు అదే మార్గంలో వెళ్తున్న పట్నం మహేందర్ రెడ్డి ఈ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. రక్తపు మడుగులో పడి ఉన్న బాధితుడి వద్దకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. తక్షణమే పోలీసుల సహాయంతో ప్రత్యేక వాహనంలో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్‌పేలో నగదు జమ.. 21 నిమిషాల్లోనే మాయం

చేవెళ్ల, నవంబర్ 19 (జనంసాక్షి): ముడిమ్యాల గ్రామానికి చెందిన రైతు గౌలికర్ సతీష్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.94,999.93 కాజేశారు. ఈ నెల 17న మధ్యాహ్నం 12.54 గంటలకు భూమి విక్రయ అడ్వాన్స్‌గా ఎండీ వాసీఫుద్దీన్ ఫోన్‌పే ద్వారా రూ.లక్ష బదిలీ చేయగా, 21 నిమిషాల్లోనే రెండు విడతలుగా నగదు డెబిట్ అయింది.

బాధితుడి ఫిర్యాదుతో రూ.11,999.93ను హోల్డ్‌లో ఉంచారు. చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.



శ్రీనివాస్ కాలనీలో పార్కు స్థలం కాపాడిన హైడ్రా

2,924 గజాల స్థలానికి ఫెన్సింగ్.. కోర్టు పరిధిలోని ఇంటికి మినహాయింపు

కీసర, నవంబర్ 19 (జనంసాక్షి) : రాంపల్లి పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో పార్కు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను హైడ్రా పరిరక్షించింది. ఆక్రమణలు తొలగించి మొత్తం 2,924 గజాల స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. క్యూర్ పరిధిలో చెరువుల పరిరక్షణతో పాటు పార్కులు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం కీసర మండలం రాంపల్లి గ్రామ పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో సర్వే నంబరు 414/105లో ఉన్న 1,127 గజాల ప్రజావసరాల స్థలం, 1,797 గజాల పార్కు స్థలాన్ని పరిరక్షించింది. మొత్తం 2,924 గజాల స్థలంలో ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేసింది. 1980వ దశకంలో రూపొందించిన ఈ లేఅవుట్‌లో పార్కులు, ప్రజావసరాల కోసం స్థలాలను కేటాయించారు. అయితే వాటిని నోటరీ ద్వారా ప్లాట్లుగా విభజించి విక్రయించారు. కొనుగోలుదారులు ప్రీకాస్ట్ గోడలు నిర్మించి స్థలాలను ఆక్రమించారు. సుమారు 300 గజాల్లో ఓ ఇంటిని కూడా నిర్మించారు. ఈ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయగా, ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఆ ఇంటిని మినహాయించి మిగిలిన ఆక్రమణలను తొలగించిన హైడ్రా.. పార్కు, ప్రజావసరాల స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

పేదలు దళితుల భూములను బలవంతంగా

స్వాధీనం చేసుకోవడం సరికాదు

హయత్‌నగర్, నవంబర్ 19 (జనం సాక్షి) :
హయత్‌నగర్ పరిధిలోని సర్వే నంబర్ 255లో దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళితుల ఏక్ సాల్ పట్టా భూములను తెలంగాణ హౌసింగ్ బోర్డుకు కేటాయిస్తూ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం పై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదలు, దళితుల జీవనాధారమైన భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం తగదని, బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ బాధితులతో కలిసి వివాదాస్పద భూములను సందర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు నష్టపరిహారం చెల్లిస్తున్నట్లుగానే, పేదలకు గతంలో కేటాయించిన అసైన్డ్, ఎక్సాల్ పట్టా భూములను స్వాధీనం చేసుకున్నప్పుడు కూడా తగిన పరిహారం అందించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేదలకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు జారీ చేయాలని, అది సాధ్యం కానిపక్షంలో కనీసం సగం భూమినైనా బాధితుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
పోలీసు బందోబస్తు మధ్య ప్రీకాస్ట్ గోడల నిర్మాణం చేపట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదలు, దళితుల భూములను బలవంతంగా



స్వాధీనం చేసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. హైదరాబాద్‌లో వందల కోట్ల విలువైన భూముల విక్రయాలకు తాము అడ్డుపడటం లేదని, అయితే పేదల జీవనాధారమైన భూములను లాక్కోవడాన్ని మాత్రం సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్, ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, ఉమ్మడి మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కింగ్‌పిన్ అరెస్టు

ఐదు రాష్ట్రాల పోలీసులకు సవాల్ విసిరి..ఇబ్రహీంపట్నంలో అరెస్ట్

50 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం.. ఇద్దరు పెడ్లర్ల పట్టివేత

రంగారెడ్డి, నవంబర్ 19 (జనంసాక్షి): డ్రగ్స్ అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఐదు రాష్ట్రాల పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న మోస్ట్ వాంటెడ్ డ్రగ్స్ కింగ్‌పిన్, కేరళకు చెందిన అబ్దుల్ మిషాల్‌ను ఇబ్రహీంపట్నంలో పోలీసులు అరెస్ట్ చేశారు. మహేశ్వరం ఎస్ఓటీ, ఇబ్రహీంపట్నం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో మిషాల్‌తో పాటు అతని అనుచరుడు తారిఖ్ పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎండీఎంఏ విక్రయిస్తున్నట్లు ఎస్ఓటీ మహేశ్వరం బృందానికి పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మెరుపు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అబ్దుల్ మిషాల్ పీ.వి (33) అనే వ్యక్తి కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా, బీరమారుతూర్ పోస్ట్, మురివాళిక్కల్ ప్రాంతానికి చెందినవాడు. ఇతను డ్రగ్ పెడ్లర్-కమ్-కన్స్యూమర్‌గా వ్యవహరిస్తున్నాడు. తారిక్ టి.వి (25) అనే వ్యక్తి మలప్పురం జిల్లా, తిరూర్, నిరమారుతూర్‌కు చెందినవాడు. బేకరీలో పనిచేస్తూ డ్రగ్స్ దందాలో పాలుపంచుకుంటున్నాడు. వీరిద్దరిని అరెస్టు చేశారు. కాగా, ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషిస్తున్న బెంగళూరుకు చెందిన పీటర్ అలియాస్ పప్పీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. పట్టుబడిన ఇద్దరి నుండి 50 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. వీరిని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ప్రధాన నిందితుడు మిషాల్ అరెస్టుతో అంతర్రాష్ట్ర డ్రగ్స్ నెట్‌వర్క్‌కు సంబంధించి మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

కదిలిన విద్యాశాఖ అధికారి

విద్యార్థులకు న్యాయం చెయ్యడమే తమ లక్ష్యం

- ఆ జిల్లా అధ్యక్షుడి పైనే చర్చ
- ఆ విషయం తనకు తెలియదన్న డీఈఓ

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేసే(ఎస్జిటీ)బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు జి. ప్రశాంతి పని చేసే పాఠశాల నుండి రిలీవ్ కావడం కోసం ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడితో పాఠశాల హెడ్ మాస్టర్ గోపీనాథ్ కు ఫోన్ చేయించడం తనకు తెలియదని రంగారెడ్డి జిల్లా డిఇఓ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు గురువారం నాడు జనంసాక్షి దినపత్రికలో ప్రచురితమైన" టీచర్ రిలీవ్ కుపైరవి" అక్రమ డిప్యూటేషన్లకు ఉపాధ్యాయ సంఘాల పైరవీలు ,పాఠశాల హెడ్ మాస్టర్ కు ఓసంఘం జిల్లా అధ్యక్షుడి హుకుం 600 మంది విద్యార్థుల చదువుతో చేలగాటం అనే జనంసాక్షి



కథనంపై డీఈఓ స్పందించారు విద్యార్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని అన్నారు పాఠశాల హెడ్ మాస్టర్ కు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఫోన్ చేయడం సరైనది కాదన్నారు ప్రస్తుతం పని చేస్తున్న అదే పాఠశాలలోనే(ఎస్జిటి) బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు అక్కడే పని చేయాలని హెడ్ మాస్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు, మరి ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పాఠశాల హెడ్మాస్టర్ కు ఫోన్ చేసి డిఈఓ పేరును ఎలా వాడుకున్నారు అనేది మరో చర్చ...

జనంసాక్షి"ఎఫెక్ట్..

చిన్నారులే దేశ భవిష్యత్తు..

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ప్రేమలతా అగర్వాల్

వారి హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టరేట్‌లో కన్నులపండువగా బాలల దినోత్సవం

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు.. విజేతలకు బహుమతుల ప్రదానం

రంగారెడ్డి, నవంబర్ 19 (జనంసాక్షి): పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం గురువారం చిన్నారుల కేరింతలతో సందడిగా మారింది. జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల దినోత్సవ వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రేమలతా అగర్వాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, పౌష్టికాహారం, సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారి సమగ్ర వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శనలు..

వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, శిశు సంరక్షణ సంస్థలు, బాల రక్షా భవన్‌కు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన రంగురంగుల నృత్యాలు, మధురమైన గీతాలు, సందేశాత్మక నాటికలు, ఉపన్యాసాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



మరోవైపు బాలల హక్కులు, రక్షణ, ఆరోగ్యం, పోషణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లు ఆకర్షించాయి. వేడుకల్లో భాగంగా చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, గీతాలాపన, క్రీడా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేయడంతో వేడుకలు ఉత్సాహభరితంగా ముగిశాయి. ఈ వేడుకల్లో జిల్లా సంక్షేమ అధికారిణి శాంతి శ్రీ, సైబరాబాద్ మహిళా భద్రతా విభాగం డీసీపీ కట్టా శ్రీదేవి, జిల్లా విద్యాధికారి పూర్ణచందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా కార్మిక అధికారిణి వెన్నెల, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు రవి, బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షులు కట్టా నరేందర్ రెడ్డి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు వాసు, బాల రక్షా భవన్ సమన్వయకర్త రోజా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్, సీడీపీఓలు, సఖి కేంద్రం బాధ్యురాలు జ్యోత్స్న పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి మహిళకు పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సీతక్క
- మహిళల ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,094 మందికి నూతన చేయూత పింఛన్లు



హైదరాబాద్ సిటీ, నవంబర్ 19 (జనం సాక్షి) : అర్హులైన ప్రతి మహిళకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళల ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ 109వ జయంతిని పురస్కరించుకుని బుధవారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని 2,094 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్‌ను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అందజేశారు. కార్యక్రమానికి ముందు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.50 లక్షల మంది మహిళలకు నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. భర్తను కోల్పోయిన మహిళలు, 30 ఏళ్లు పైబడిన అవివాహిత మహిళలకు పింఛన్లు అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెండు నెలలపాటు దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. నూతనంగా మంజూరైన పింఛన్ల మొత్తాన్ని ఈ నెల 26న ముఖ్యమంత్రి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు స్వయం సహాయక సంఘాల్లో చేరాలని సూచించారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తూ చిన్న దుకాణాలు, క్యాంటీన్లు, టిఫిన్ సెంటర్లు, కుట్టు మిషన్ యూనిట్లు వంటి స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.75 వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమేనని సీతక్క తెలిపారు. ఈ నెల 26 నుంచి కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సీతక్క తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ, నూతనంగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్, నాంపల్లి తహసీల్దార్ నయీముద్దీన్, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్య, షేక్‌పేట్ తహసీల్దార్ శంకర్, ఇతర రెవెన్యూ అధికారులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

యాడారంలో భూ రీ సర్వేను పరశీలించిన అడిషనల్ కలెక్టర్ విజయెందర్ రెడ్డి



శామీర్‌పేట్, నవంబర్ 19 (జనం సాక్షి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే లో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని శామీర్ పేట్ మండలంలోని యాదారం, తుర్కపల్లి గ్రామాలలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి పర్యవేక్షించారు. భూరీ సర్వే పై రైతులకు అవగాహన కల్పించాలని, వారి వారి సరిహద్దులను కచ్చితంగా నిర్ణయించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పాసుబుక్కులోని భూ ఆధార్ నంబర్ తో ఆన్ లైన్ లో లోకేషన్ గుర్తించడం జరుగుతుందని మండల తహసీల్దారు అదనపు కలెక్టర్ కు వివరించారు. భూ సర్వే గురించి రైతులతో మాట్లాడి సర్వేయర్లకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహసీల్దారు శ్రీనివాస్, ఆర్ఐ భానుచందర్, సర్వేయర్లు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రో



తాండూరు, నవంబర్ 19 (జనంసాక్షి) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో పేర్కొన్నారు.బదిలీపై కరణ్‌కోట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన ఇన్‌స్పెక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కరణ్‌కోట్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర న్యాయం అందించాలని సూచించారు. నేర నియంత్రణ, మహిళా భద్రత, రోడ్డు భద్రత అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం సిఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అసంక్రమిత వ్యాధుల నియంత్రణ తీరుపై విదేశీ బృందం పరిశీలన



అల్వాల్, నవంబర్ 19 (జనంసాక్షి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అసంక్రమిత వ్యాధుల నివారణ, గుర్తింపు, నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరును అధ్యయనం చేసేందుకు అంతర్జాతీయ ప్రతినిధుల బృందం బుధవారం అల్వాల్ పీహెచ్‌సీని సందర్శించింది. అమెరికా, బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవులు, తైవాన్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డా. శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కేంద్రంలో అందిస్తున్న సేవలు, కార్యక్రమం అమలు విధానాన్ని వివరించారు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి వ్యాధుల గుర్తింపు పరీక్షలు, రోగుల నమోదు, మందుల లభ్యత, సరఫరా, వైద్య వివరాల డిజిటల్ నమోదు, తదుపరి వైద్య పర్యవేక్షణ విధానాలను ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను కూడా వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ పర్యటనలో డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డా. అబ్దుల్ వస్సే, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. చంద్రకళ, వైద్యాధికారి డా. శ్రీకాంత్, సూపర్‌వైజర్ అరుణ, ఫార్మసిస్ట్ సృజన, స్టాఫ్ నర్స్ ప్రణయ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నర్సాపూర్, నవంబర్ 19 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ లీగల్ కౌన్సిల్ కాట్రోత్ రాజు నాయక్ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో, కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం. హేమలత సూచనలతో నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కాట్రోత్ రాజు నాయక్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నియంత్రణలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే చట్టపరమైన సమస్యలను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్. రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, కన్నవారికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించిన మండల్ లీగల్ సర్వీస్ కమిటీకి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. గణేష్, ఎన్. అనిల్ కుమార్, జి. నవలీల, లీగల్ సర్వీస్ సిబ్బంది టి. అరుణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల సమస్యలు పరిష్కరించాలి



సంగారెడ్డి నవంబర్ 19 (జనం సాక్షి) : కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలిశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి, తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. గ్రామంలోని సర్వే నంబర్ 92కు సంబంధించిన భూముల భూ రికార్డుల్లో పలు సమస్యలు ఉన్నాయని, భూముల విస్తీర్ణంలో తేడాలు, పంట రుణాలు, చెల్లింపులకు సంబంధించిన అంశాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తమకు వాస్తవంగా రెండు ఎకరాల భూమి ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో ఒక ఎకరం 20 గుంటలుగానే నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, భూ రికార్డుల్లో జరిగిన తప్పులను సరిచేయడంతో పాటు, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైతుల సమస్యలను విన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, భూముల విస్తీర్ణంలో తేడాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా పారదర్శకంగా విచారణ చేపట్టి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ధారూర్, నవంబర్ 19 (జనంసాక్షి) : పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని గ్రామ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్ అన్నారు. గురువారం నాడు మండల పరిధిలోని నాగసముందర్ గ్రామంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పింఛన్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగసముందర్ గ్రామ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్ మాట్లాడుతూ నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక చేయూత లభిస్తుందని అన్నారు.గతంలో పింఛన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన లైన పేదలకు నేడు చేయూత పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.పేదల సంక్షేమం పట్ల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి కీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో నాగసముందర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సర్పంచ్ అన్నారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మదారి సంగీత యాదప్ప, వికారాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ లాల్ అహ్మద్,గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చెనగల్ల ఎలప్ప,గ్రామ పంచాయతి కార్యదర్శి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.



ఎస్ఐ పేరుతో సైబర్ మోసం..

- రూ.20 వేల నగదు స్వాహా

టేక్మాల్, నవంబర్ 19 (జనం సాక్షి) : టేక్మాల్ పోలీసు అధికారి పేరుతో ఫోన్ చేసి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.20 వేల నగదును కాజేశారు. ఈ ఘటన టేక్మాల్ మండలంలో చోటుచేసుకుంది.టేక్మాల్ గ్రామానికి చెందిన సయ్యద్ ఆరీఫ్‌కు బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, తాను టేక్మాల్ ఎస్ఐనని పరిచయం చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో నగదు పంపాలని నమ్మబలికి రెండు వేర్వేరు నంబర్లకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు బదిలీ చేయించుకున్నాడు. ఎంతకీ నగదు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులను సంప్రదించగా, ఎస్ఐ అలాంటి ఫోన్ చేయలేదని తెలిసింది. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి టేక్మాల్ పోలీసులతో పాటు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు అధికారులు, ఇతర ప్రముఖుల పేర్లతో ఫోన్ చేసి డబ్బులు అడిగితే నమ్మవద్దని, పూర్తి వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే నగదు బదిలీ చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

విద్యా భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- జాప్యం చేస్తే సహించేది లేదు
- అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



వనపర్తి, నవంబర్ 19 (జనం సాక్షి) : విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన పాఠశాలలు, జూనియర్ కళాశాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల నూతన భవనాలను కలెక్టర్ సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు వెంటనే సమాచారం అందించి పనుల వేగం పెంచాలని, నిర్ణీత సమయంలోగా నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులు సాయంత్రం వేళల్లోనూ క్రీడల్లో పాల్గొనేందుకు వీలుగా మైదానంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా యువజన, క్రీడల అధికారిని ఆదేశించారు. తదుపరి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 1వ తేదీ నాటికి పాఠశాల యాజమాన్యానికి భవనాన్ని అప్పగించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ముందు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జెడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అవిలయ్య, డీవైఎస్‌వో సుధీర్ రెడ్డి, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

బోడుప్పల్ సర్కిల్‌లో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన...

- జీపీవీల పరిశుభ్రత, బెల్‌మౌత్‌ల విస్తరణకు ఆదేశాలు
- రోడ్ల గుంతల మరమ్మతులు,అనవసర కేబుళ్ల తొలగింపునకు చర్యలు



బోడుప్పల్, నవంబర్ 19 (జనంసాక్షి) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టం చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. గురువారం బోడుప్పల్ సర్కిల్-10 పరిసర ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి వివిధ సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (జీపీవీలు)ను సందర్శించి పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, అన్ని జీపీవీలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు రహదారుల కూడళ్ల వద్ద ఉన్న బెల్‌మౌత్ ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న ప్రాంతాల్లో బెల్‌మౌత్‌లను విస్తరించాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా రహదారుల కూడళ్లను అభివృద్ధి చేయాలని, ఈ పనులను టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

అనవసర కేబుళ్ల తొలగింపునకు కార్యాచరణ

విద్యుత్ స్తంభాలపై పేరుకుపోయిన వినియోగంలో లేని కేబుళ్లు, అనవసర వైర్ల తొలగింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. సాయినగర్ కాలనీలో చేపట్టిన తరహాలోనే సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీల్లో కేబుల్ ఆపరేటర్లతో సమన్వయం చేసుకుని అనవసర వైర్లను తొలగించాలని ఆదేశించారు.

రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యత

సర్కిల్ పరిధిలోని బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను జెట్ ప్యాచింగ్ విధానంలో మరమ్మతు చేయాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారులను సురక్షితంగా తీర్చిదిద్దాలని, మరమ్మతు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, రహదారుల మరమ్మతులు, అనవసర కేబుళ్ల తొలగింపు వంటి అంశాలను ప్రాధాన్యతా పనులుగా గుర్తించి సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ శైలజతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం),మెయింటెనెన్స్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీకృష్ణ

వీపనగండ్ల, నవంబర్ 20 (జనం సాక్షి) : వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ హాజరై ఆశా కార్యకర్తలకు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా గర్భిణుల ముందస్తు నమోదు ఏఎన్‌సి (రిజిస్ట్రేషన్) పెంపొందించడం,నిర్ణీత సమయాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, పి హెచ్‌సిలో సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం,నమోదు పెంచడం, అన్ని ఆరోగ్య సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం, అమలులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అధికారి వంశీకృష్ణ డాక్టర్ రాజశేఖర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు హేమవర్ధన్, శ్వేత, కరుణాశ్రీ, భాగ్యశ్రీ, కవిత, మౌనిక, పి హెచ్ ఎన్ సునాధ, సూపర్‌వైజర్లు విజయకుమారి,హెల్త్ అసిస్టెంట్ జానీర్, ఏఎన్ ఎం లు ,ఆశా కార్యకర్తలు తదితరు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 నవంబర్ 2026

రేంకొని వాగులో యంత్రాల ఘోరం..

రాత్రి వేళల్లో ఇసుక దోపిడీ జోరు!

- నీరున్నా సరే అడుగు భాగం నుంచి ఇసుక తవ్వకాలు..
- పట్టించుకోని యంత్రాంగం..
- లోతుగా మారుతున్న వాగులు!



ఖానాపూర్ నవంబర్ 19 (జనం సాక్షి) : ఖానాపూర్ పట్టణ శివారులోని రేంకొని వాగు ప్రకృతి అందాలకు, స్థానిక అవసరాలకు నిలయంగా ఉండేది. అయితే, ఇప్పుడు ఆ వాగు పై అక్రమార్కుల కన్నుపడింది. ప్రకృతి సంపదను కొల్లగొట్టడమే లక్ష్యంగా ఇసుక మాఫియా రోజురోజుకూ తన పంథాను మార్చుకుంటూ, కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. గతంలో వాగులో ఇసుక తీయాలంటే కూలీల సాయమో, జె సి బి ల వాడకమో ఉండేది. కానీ ఇప్పుడు కాలం మారింది, అక్రమార్కుల ఆలోచనలూ మారాయి.



నీటిలోనే ఇసుక తవ్వకాలు.. కొత్త యంత్రాల మాయ!

రేంకొని వాగులో ప్రస్తుతం నీరు ఉన్నప్పటికీ, అక్రమార్కులు ఏమాత్రం వెనకాడటం లేదు. ట్రాక్టర్లకు ప్రత్యేకమైన యంత్రాలను అమర్చి, వాగులోని నీటి అడుగు భాగం నుంచి నేరుగా ఇసుకను తోడేస్తున్నారు. ఇలా తీసిన ఇసుకను వాగు ఒడ్డున పోగు చేసి, ఆపై ట్రాక్టర్లు, లారీల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల తక్కువ సమయంలోనే భారీగా ఇసుకను తోడే అవకాశం అక్రమార్కులకు దొరుకుతోంది.

'మూడు పూలు.. ఆరు కాయలు'గా రాత్రి దందా

పగటిపూట ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, రాత్రి వేళల్లో అక్రమార్కుల దందా యథేచ్ఛగా సాగుతోంది. చీకటిని అడ్డుపెట్టుకుని ట్రాక్టర్లు, లారీలతో వరుస కట్టి ఇసుకను తరలిస్తున్నారు. అక్రమార్కులకు ఈ దందా 'మూడు పూలు.. ఆరు కాయలు' అన్నట్లుగా లాభాల పంట పండిస్తోంది.

లోతుగా మారుతున్న వాగులు..

ఇసుకను అడ్డగోలుగా, అడుగు భాగం వరకు తవ్వేస్తుండటంతో రేంకొని వాగు ప్రమాదకరంగా, అతి లోతుగా మారిపోతోంది. దీనివల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. వాగు ఒడ్డులు కోతకు గురై, సమీపంలోని వ్యవసాయ భూములకు, పశువులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి అక్రమార్కులతో అధికారులు కుమ్మక్కయ్యారా లేక నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు ప్రజల్లో ప్రకృతి ప్రేమికుల్లో తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెయిన్మొని వాగుతోపాటు పరిసర ప్రాంతాలలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని, ప్రత్యేక యంత్రాలను సీజ్ చేసి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రకృతి ప్రేమికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కంపెనీల పెట్టుబడుల రహస్య సమాచారం లీక్

- 15 మంది అధికారులను తొలగించిన సీఎం విజయ్



చెన్నై (జనంసాక్షి) : తమిళనాడులో పలు కంపెనీల పెట్టుబడులకు సంబంధించిన రహస్య సమాచారం ఆంధ్రప్రదేశ్‌కు లీకైనట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. పలు ప్రాజెక్టులు ఆంధ్రాకు తరలిపోవడంతో ఇది మరింత బలపడింది. దీనిపై దర్యాప్తు చేసిన తమిళనాడు ప్రభుత్వం 15 మంది సీనియర్ అధికారులను తొలగించింది. దీంతో ఇరు రాష్ట్రాల్లో రాజకీయ వివాదానికి ఇది దారి తీసింది. తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం అనుసరిస్తున్న ఇన్వెస్ట్‌మెంట్ విధానానికి సంబంధించిన కీలక సమాచారం ఆంధ్రప్రదేశ్‌కు లీకైనట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. మొదట తమిళనాడులో పెట్టుబడులకు ముందుకు వచ్చిన కొన్ని ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోవడంతో ఈ అనుమానాలు మరింత బలపడ్డాయి.

కాగా, తమిళనాడు పెట్టుబడి ప్రోత్సాహక సంస్థ అయిన గైడెన్స్ తమిళనాడు' ఆ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఈ ప్రభుత్వ విభాగంలో చాలా కాలంగా పని చేస్తున్న సీనియర్ అధికారులు కీలకమైన పెట్టుబడుల రహస్య సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చేరవేసినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. తమిళనాడులో ఇన్వెస్ట్‌మెంట్ కోసం ముందుకు వచ్చిన కంపెనీల వివరాలను ఆంధ్రా ప్రభుత్వానికి వారు అందజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో దర్యాప్తు తర్వాత 15 మంది సీనియర్ అధికారులను తమిళనాడు ప్రభుత్వం తొలగించింది. తొలగించిన సీనియర్ అధికారుల్లో చాలా మంది 2016 నుంచి 2021 వరకు అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వీరు తమ పదవుల్లో కొనసాగారు. మరోవైపు తమిళనాడు ప్రభుత్వం తొలగించిన అధికారులలో ముగ్గురు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పనిచేస్తున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. తమిళనాడులో పెట్టుబడులను ప్రోత్సహించే ప్రయత్నాలను దెబ్బతీయడానికి పెద్ద కుట్ర జరిగిందా? పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. కీర్తన నేతృత్వంలోని శాఖను లక్ష్యంగా చేసుకున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే డీఎంకే నాయకుడు, తమిళనాడు మాజీ పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా ఈ వివాదంపై స్పందించారు. ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఆయన విమర్శించారు, దశాబ్దాలుగా నిర్మితమైన ఒక సంస్థను రాజకీయ వివాదంలోకి ప్రభుత్వం లాగుతోందని ఆయన ఆరోపించారు. 'తమిళనాడుకు చెందిన అత్యుత్తమ మేధావుల కృషి ఫలితంగా ఏర్పడిన ఒక సంస్థను, ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న అపరిపక్వమైన, సోషల్ మీడియా ఆధారిత రాజకీయాల ద్వారా దెబ్బతీయడం చాలా బాధాకరం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అలాగే కొంతమంది ఉద్యోగులు సంస్థను వీడటం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం దెబ్బతింటుందనే ప్రభుత్వ వాదనను కూడా టీఆర్‌బీ రాజా ప్రశ్నించారు. 'తమిళనాడు పెట్టుబడుల వ్యవస్థ, పారిశ్రామిక వాతావరణం అంత బలహీనంగా ఉన్నాయని ఈ ప్రభుత్వం భావిస్తోందా?' అని ఆయన నిలదీశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ కూడా ఈ ఆరోపణలను ఖండించింది.

జాతీయ ర్యాంకింగ్స్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు 23వ స్థానం

శతాబ్ది ఉత్సవాల వేళ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ గుర్తింపు



హనుమకొండ, నవంబర్ 19 (జనంసాక్షి) : కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల జాతీయ స్థాయిలో మరో విశిష్ట గుర్తింపును సాధించడం పట్ల విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మక ఎడ్యుకేషన్ వరల్డ్ భారత ఉన్నత విద్యా సంస్థల ర్యాంకింగ్స్ 2026-27లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలల విభాగంలో 23వ స్థానాన్ని సాధించడం విశ్వవిద్యాలయానికి, ఉత్తర తెలంగాణ విద్యారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. మొత్తం 700 మార్కులకు గాను 462 మార్కులు సాధించడం కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని తెలిపారు.

కళాశాల 2023లో 23వ స్థానం, 2024లో 23వ స్థానం, 2025లో 25వ స్థానం సాధించగా, 2026-27లో తిరిగి 23వ స్థానాన్ని దక్కించుకోవడం విశేషమన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యాసంస్థల్లో ఈ విభాగంలో అత్యున్నత స్థానాన్ని సాధించడం ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు.

నాణ్యమైన బోధన, అధ్యాపకుల పరిశోధనాత్మక కృషి, నూతన పాఠ్యప్రణాళికలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు అవసరమైన శిక్షణతో పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలు కళాశాల ప్రగతికి దోహదపడుతున్నాయని ఉపకులపతి తెలిపారు. అధ్యాపకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా పత్రాలు ప్రచురిస్తూ ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నారని అభినందించారు.

1927 ఆగస్టు 27న స్థాపించబడిన కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల 2027 ఆగస్టు 27 నాటికి వందేళ్లు పూర్తి చేసుకోనుందని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల వేళ జాతీయ స్థాయిలో 23వ స్థానం సాధించడం కళాశాల చరిత్రలో మరో గర్వకారణమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, ఉపకులపతి అందించిన అభినందనలు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయని, ఈ జాతీయ గుర్తింపు కళాశాల సమిష్టి కృషికి దక్కిన గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ఓఎస్‌డీ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ సురేష్ లాల్, ప్రొఫెసర్ వెంకయ్య, ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొని కళాశాల సాధించిన విజయాన్ని అభినందించారు.

యువ పర్వతారోహకుడు కార్తీక్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందన

పర్వతారోహణలో విశేష ప్రతిభ కనబరుస్తూ జిల్లా ఖ్యాతిని చాటుతున్న యువకుడు



కెరమెరి, నవంబర్ 19 (జనంసాక్షి) : కెరమెరి మండలం కెలి (కె) గ్రామానికి చెందిన యువ పర్వతారోహకుడు గిత్తె కార్తీక్ సాధించిన పర్వతారోహణ విజయాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించారు. ఇటీవల ఎమ్మెల్యేను కలిసిన కార్తీక్ తన పర్వతారోహణ ప్రయాణం, శిక్షణ, వివిధ పర్వత యాత్రల్లో సాధించిన విజయాలను వివరించారు. ఆయన పట్టుదల, ధైర్యసాహసాలు, కష్టపడే తత్వాన్ని ఎమ్మెల్యే ప్రశంసించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గిట్టె కార్తీక్ చిన్న గ్రామం నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించి పర్వతారోహణ రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. 2022లో సిక్కింలోని హిమాలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ అండ్ ఎకో టూరిజంలో బేసిక్ మౌంటెనీరింగ్ కోర్సును గ్రేడ్ ఎ తో పూర్తి చేశారు. 2023లో అరుణాచల్ ప్రదేశ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ అడ్వాన్స్‌డ్ మౌంటెనీరింగ్ కోర్సును పూర్తి చేశారు.

కార్తీక్ సాధించిన ముఖ్యమైన విజయాలు:

ఆల్ట్ 22 వర్జిన్ పీక్, సిక్కిం: సుమారు 5,300 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేశారు.

మౌంట్ కనామో యాత్ర, 2025: హిమాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ కనామో యాత్రలో సుమారు 5,900 మీటర్ల ఎత్తు వరకు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శిఖరాగ్రానికి చేరుకోలేకపోయారు.

హై ఆల్టిట్యూడ్ ఎక్స్‌ప్లోరేటరీ ట్రెక్-2026: భారత పర్వతారోహణ సమాఖ్య భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రకు ఎంపికై విజయవంతంగా పాల్గొన్నారు. ఈ యాత్రలో సుమారు 66 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 9,868 అడుగుల ఎత్తుకు చేరుకున్నారు.

అంతేకాకుండా వాటర్‌ఫాల్ రాపెల్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ కోర్సును అభ్యసిస్తున్న కార్తీక్ విద్యతో పాటు పర్వతారోహణపై తన ఆసక్తిని కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతమైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేయడమే తన ప్రధాన లక్ష్యమని కార్తీక్ తెలిపారు. తన లక్ష్య సాధనలో ప్రోత్సాహం అందిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువత కూడా పట్టుదలతో కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగలరని కార్తీక్ ప్రయాణం నిరూపిస్తోంది. ఎమ్మెల్యే అందించిన ప్రోత్సాహం తనకు మరింత స్ఫూర్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు.



ఏసీబీకి చిక్కిన ఇన్‌స్పెక్టర్

- అదనంగా హోటల్ నిర్వహణ కోసం లంచం
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

హైదరాబాద్ (జనంసాక్షి) : అదనంగా హోటల్ నిర్వహణ కోసం లంచం తీసుకున్న గోల్కొండ జోన్ టోలిచౌక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయక్ ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భవిష్యత్తులో ప్రతి నెల రాత్రి ఒంటి గంట వరకు కేఫెటిరియా తెరిచి ఉండటానికి, ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్స్ పూర్తి చేయడంలో సహాయం చేయడానికి గాను నిర్వాహకులు ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించారు. దీంతో ప్రతి నెలా రూ.50 వేలు డిమాండ్ చేయగా మొదటి నెల రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొదటి విడతలో రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు చేసిన తనిఖీలో నాలుగు ఎనవలప్ కవర్‌లో రూ.1.80 వేలు నగదు లభించాయని, అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచామని వివరించారు.

ఇంజిన్‌లో సమస్య..మధ్యలోనే నిలిచిపోయిన కృష్ణా ఎక్స్‌ప్రెస్



మహబూబాబాద్ (జనంసాక్షి) : ఇంజిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా తిరుపతి నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు హఠాత్తుగా నిలిచిపోయింది. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే, రైలు అకస్మాత్తుగా ఆగిపోవడంతో ప్రయాణికులు కొద్దిసేపు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఇది కేవలం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య వల్లేనని దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పష్టం చేయడంతో ప్రయాణికులు రైల్వే మార్గంలో ఉండటంతో, ఈ రైలు నిలిచిపోవడం వల్ల ఇతర రైళ్ల రాకపోకలపై స్వల్ప ప్రభావం పడే అవకాశం ఉంది. సమాచారం అందుకున్న వెంటనే సాంకేతిక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టాయి. సమస్యను త్వరగా పరిష్కరించి, రైలును సురక్షితంగా గమ్యస్థానానికి తరలించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రయాణికులు సంయమనం పాటించి, రైల్వే సిబ్బందికి సహకరించాలని కాస్త కుదుటపడ్డారు. మహబూబాబాద్ ప్రధాన అధికారులు కోరారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



అశ్వాపురం (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓం శక్తి ఆలయం, సాయిబాబా ఆలయాల్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రాచలం డీఎస్పీ/ఇన్‌చార్జ్ మణుగూరు డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల మధ్య అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగలగొట్టి అమ్మవారి మెడలోని మూడు బంగారు పుస్తెల తాళ్లను (105 గ్రాములు), వెండి కిరీటాలు, చేతులు, పాదాలు, శఠగోపం తదితర వెండి వస్తువులను దొంగిలించారు. మొత్తం 7 కిలోల 900 గ్రాముల వెండి వస్తువులతో పాటు బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.7,54,000 ఉంటుందని ఆలయ సూపర్ వైజర్ రామకృష్ణన్ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, డీఎస్పీ పర్యవేక్షణలో సీసీఎస్ బృందం, అశ్వాపురం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం గొల్లగూడెం శివారులోని సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు అశ్వాపురంలోని ఓం శక్తి, సాయిబాబా ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితులు షేక్ జానీ జానీ షరీఫ్ - నవభారత్, పాల్వంచ (స్వస్థలం: రెడ్డిపాలెం, బూర్గంపహాడ్ మండలం); సప్పా కాంతారావు - కమ్మరిగూడెం గ్రామం, వేలేరుపాడు మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్; ఊర లింగయ్య - కొత్తపేట గ్రామం, కేతపల్లి మండలం, నల్గొండ జిల్లా. విచారణలో భాగంగా నిందితుల గత నేర చరిత్రను పరిశీలించగా, షేక్ జానీపై 11, సప్పా కాంతారావుపై 14, ఊర లింగయ్యపై 8 చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. అరెస్ట్ చేసిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసి, చోరీ సొత్తును రికవరీ చేసిన అశ్వాపురం పోలీస్ సిబ్బంది, సీసీఎస్ బృందాన్ని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

దీక్షా దివస్ స్ఫూర్తి కొనసాగుతుంది : నాగరాజు గుర్రాల



జోహన్నెస్‌బర్గ్, దక్షిణాఫ్రికా (జనంసాక్షి) : దీక్షా దివస్ స్ఫూర్తి కొనసాగుతుందని బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శాఖ నాయకుడు గుర్రాల నాగరాజు అన్నారు. నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 14 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మూడవ రోజు కోర్ కమిటీ సమావేశం నాగరాజు గుర్రాల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా కోర్ కమిటీ సభ్యులందరూ పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపు. నాడు కేసీఆర్చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కొత్త ఊపిరి పోసింది. ఆ దీక్షా ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందనే చారిత్రక సత్యాన్ని భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ బిగాల ఆన్‌లైన్ ద్వారా పాల్గొని కోర్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

దీక్షా దివస్ చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తూ, 14 రోజుల కార్యక్రమాల లక్ష్యాలు, నిర్వహణ, తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలకు చేరవేయడంపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి మేడసాని, హరీశ్ రంగ, అరవింద్ చీకోటి, కిరణ్ కుమార్ బెల్లి, సాయి కిరణ్ నల్ల, సౌజన్ రావు, రాంబాబు, వురే వంశీ, వెంకట్ రావు తల్లపల్లి, నవదీప్ రెడ్డి, రంజిత్, బాలు, విజయ్ జుంజూర్, సుమన్ పోరండ్ల, రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితర కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370